ప్రజాశక్తి

శనివారం 7 జనవరి 2023 8 పేజీలు

గుంటూరు పల్నాడు





పెన్షన్.. టెన్షన్..

- ఆరో తేదీ దాటినా జమవ్వని సొమ్ము
- విశ్రాంత ఉద్యోగుల లబోదిబో
- ఇలా ఎప్పుడూ లేదని ఆవేదన



ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వ అస్తవ్యస్త ఆర్థిక నిర్వహణ ప్రభావం ఈసారి విశ్రాంత ఉద్యోగులపై పడింది. ప్రతినెలా రిటైర్డు ఉద్యోగులకు ఒకటి నుంచి ఐదో తేదీల్లోగా పెన్షన్ సొమ్ము వారి ఖాతాల్లో జమవుతుంది. ఉద్యోగులు, ఉపాధ్యాయులకు మాత్రం 5 నుంచి 15వ తేదీ తరువాత జీతాలు జమవుతుంటాయి. ఈసారి ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఈనెల ఐదో తేదీలోగా 80 శాతం మందికి వేతనాలు జమ కాగా పెన్షనర్లకు మాత్రం పెండింగ్‌లో ఉంచారు. దీంతో ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 35 వేల మంది తమ పెన్షన్ కోసం ఎదురుచూస్తున్నారు.

పెన్షనర్లలో అతితక్కువ పెన్షన్ పొందుతున్న వారున్నారు. వీరిలో రూ.10 వేలులోపు వారు ఐదు వేలు, రూ.10 వేలు దాటిన వారు 10 వేల మంది ఉండగా రూ.20 వేలు దాటిన వారు 20 వేల మంది వరకు ఉన్నారు. కొన్ని నెలలుగా రూ.10-15 వేలు లోపు పెన్షన్ తీసుకునే వారికి ఒకటి నుంచి ఐదో తేదీలోగా జమ చేస్తూ వచ్చారు. ఈసారి మాత్రం ఎవరికీ జమకాలేదు. పెన్షనర్లలో 62-90 ఏళ్ల వారున్నారు. తాజా పరిస్థితితో వారంతా తీవ్ర ఆందోళన నెలకొంది. రూ.లక్షల్లో వేతనాలు పొందుతున్న ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు, సలహాదారులు, కార్పొరేషన్ చైర్మన్లకు సకాలంలో జీతాలిస్తున్న ప్రభుత్వం తమను మాత్రం తిప్పలు పెట్టడం ఏమిటీని విమర్శిస్తున్నారు. ఇలా గతంలో ఎప్పుడూ లేదని వాపోతున్నారు.

పెన్షనర్లకు ఇవ్వాల్సిన డిఎలు ఇవ్వడం లేదు. పిఆర్‌సిలో కోత పెట్టారు. ఐఆర్ 27 శాతం ఇచ్చి ఫిట్‌మెంట్ 23 శాతం ఇచ్చిన ప్రభుత్వాన్ని తమ జీవితంలో చూడలేదని రిటైర్డు ఉద్యోగులు విమర్శిస్తున్నారు. రిటైర్డు ఉద్యోగుల పట్ల ఇంత చిన్నచూపుతో ఏ ప్రభుత్వం వ్యవహరించలేదని చెబుతున్నారు. అతి తక్కువ పింఛను సొమ్ముతో జీవనం వెళ్లదీస్తున్నవారి పరిస్థితి అత్యంత దయనీయంగా ఉంటోంది. ప్రధానంగా అనారోగ్య సమస్యలతో సతమతమయ్యేవారు, బిడ్డల ఆదరణకు దూరమైన వారికి పింఛను సొమ్మే ప్రధాన జీవన ఆధారంగా ఉంటోంది. ఈ సొమ్ము కూడా ఇవ్వకుండా ప్రభుత్వం ఇబ్బంది పెట్టడంపై రిటైర్డు ఉద్యోగులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫ్యామిలీ పెన్షనర్లు, వితంతు, మెంటల్ డిజార్డర్ పెన్షన్లు మంజూరుకాక రిటైర్డు ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారని గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.వెంకటేశ్వర్లు, జి.ప్రభుదాస్ చెప్పారు. ఎక్కువ మందికి ప్రతినెలా 13వ తేదీ వరకూ పెన్షన్లు జమ కావట్లేదన్నారు. దీనిపై జిల్లా ఖజానా శాఖ అధికారి రాజగోపాలరావు వివరణిస్తూ క్రమంగా ఒక్కొక్కరికి జమవయడం ప్రారంభమైందని, రెండు రోజుల్లో అందరికి వస్తాయని అన్నారు.

అధ్వానంగా ధాన్యం కొనుగోలు

- రవాణాకు కాంట్రాక్టర్ నియామకం ఏది
- ప్రైవేటు వ్యాపారులకే పంటనమ్మి నష్టపోతున్న రైతులు
- కౌలురైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు
- పలు గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో పరిశీలన

2లో

జాతీయ స్థాయి తైక్వాండోకు గుంటూరు క్రీడాకారిణి

ప్రజాశక్తి-గుంటూరు



కళాజ్యోష్ణను అభినందిస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు

తైక్వాండో రాష్ట్రస్థాయి పోటీల్లో స్వర్ణపతకం సాధించిన రాచమల్లు కళాజ్యోష్ణను జిల్లా కలెక్టర్ ఎం.వేణు గోపాల్‌రెడ్డి శుక్రవారం కలెక్టరేట్‌లో అభినందించారు. గతనెల 26, 27 తేదీల్లో కడప, రైల్వే కోడూరులో జరిగిన స్కూల్‌గేమ్స్ రాష్ట్ర స్థాయి ఎంపికల్లో అండర్-19 విభాగంలో గుంటూరులోని మైస్పేస్ తైక్వాండో అకాడమీ క్రీడాకారిణి రాచమల్లు కళాజ్యోష్ణ బంగారు పతకం సాధించింది. జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ తైక్వాండో పోటీలకూ ఎంపికైంది. జాతీయ స్థాయిలోనూ రాణించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. కళాజ్యోష్ణను అభినందించిన వారిలో స్టెప్ సిఇఒ పి.వెంకటనారాయణ, ఇంటర్ ఆర్ఐఒ సునీత, ఎస్ఆర్ కాలేజి జోనల్ ఇన్‌ఛార్జి ఎం.పూర్ణచంద్ర రావు, అకాడమీ డీన్ అప్పిరెడ్డి, ప్రధానాచార్యులు నిమ్మగడ్డ సురేష్ పాల్గొన్నారు.

నేడు మాధవిపెద్ది సత్యం శత జయంతుత్సవం

మాధవ పెద్ది పురస్కారాలను అందుకోనున్న గాయని శైలజ, సంగీత దర్శకులు సురేష్

2లో

క్వారీయింగ్ ప్రాంతంలో పరిశీలనకు వెళ్లిన నరేంద్రకుమార్



ఏళ్లతరబడి గ్రావెల్ అక్రమ తవ్వకాలు

- అధికారుల అండతోనే తరలింపు : మాజీ ఎమ్మెల్యే డి.నరేంద్ర
- వీరనాయకునిపాలెం, శేకూరులో లారీలను అడ్డుకుని ఆందోళన

ప్రజాశక్తి - చేబ్రోలు

అక్రమ మైనింగ్‌కు పాల్పడుతున్నారంటూ మండలంలోని వీరనాయకునిపాలెం, శేకూరులో గ్రావెల్ లారీలను మాజీ ఎమ్మెల్యే డి.నరేంద్రకుమార్ అడ్డుకున్నారు. ఆయన్ను అక్కడి నుండి పంపించేందుకు పోలీసులు ప్రయత్నించా టిడిపి శ్రేణులు అడ్డుపడ్డారు. ఈ క్రమంలో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. శుక్రవారం చోటుచేసుకున్న ఘటనపై వివరాల ప్రకారం.. క్వారియింగ్ ప్రాంతాలను శుక్రవారం పరిశీలించిన నరేంద్రకుమార్ వీరనాయకునిపాలెంలో లారీలను అడ్డుకున్నారు. అక్రమ మైనింగ్ జరుగుతున్నా అధికారులు మౌనంగా ఉన్నారంటూ మండిపడ్డారు. ఇది తెలిసిన పోలీసులు ఘటనా స్థలికి చేరుకున్నారు. అయన్ను అరెస్టు చేస్తారేమోనని పోలీసులకు టిడిపి శ్రేణులు అడ్డుపడ్డారు. దీంతో ఆ 2లో



ఐద్వా జెండావిష్కరణ

జాతీయ మహాసభ జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి-సత్తెనపల్లి

కేరళలో జరిగే అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) 13వ జాతీయ మహాసభ జయప్రదం కోసం స్థానిక 25వ వార్డులో జెండాను ఆవిష్కరించారు. జెండాను ఐద్వా పట్టణ ఉపాధ్యక్షులు డి.విమల ఆవిష్కరించగా కార్యదర్శి గద్దె ఉమశ్రీ మాట్లాడుతూ చిన్న పిల్లల దగ్గర నుండి వృద్ధుల వరకు మహిళలు హింసకు గురవుతున్నారని, వీటి నివారణకు చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని కోరారు. నిత్యావసర వస్తువుల ధరలు, పన్నుల భారం పెరిగి సామాన్యులపై ఇబ్బందులు పెరిగాయని, ఈ ఆర్థిక వత్తిళ్లకు మహిళలే ఎక్కువగా గురవుతున్నారని చెప్పారు. వ్యవసాయం దెబ్బతిని పనులు తగ్గాయని, వ్యవసాయంలో కీలకమైన మహిళలు ఉపాధి కోల్పోయారని అన్నారు. ఈ నేపథ్యంలో ఉపాధి హామీ చట్టం కింద పనులు, కూలిరేట్లు 2లో



పట్టుబడిన నిందితులతో పోలీసులు

చోరీ కేసులో ముఠా అరెస్టు

రూ.10.10 లక్షలు, ద్విచక్ర వాహనం స్వాధీనం

ప్రజాశక్తి - నరసరావుపేట

ఒకసారి చోరీకి పాల్పడిన ఇంటికే మళ్లీ వచ్చిన దుండగుడు పట్టుబడంతో చోరీ ముఠా గుట్టు రట్టయ్యింది. వరుస చోరీలకు పాల్పడుతున్న ముఠాను పల్నాడు జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు వివరాలను ఎస్పీ రవిశంకర్‌రెడ్డి శుక్రవారం వెల్లడించారు. గతేడాది ఆగస్టు 18న అర్ధరాత్రి రాజుపాలెం మండల కేంద్రానికి చెందిన గణేష్ నర్సరీ యజమాని పగడాల సాంబయ్య ఇంట్లోకి దుండగులు కత్తులతో ప్రవేశించిన రూ.17 లక్షలు, రూ.20 వేలు విలువైన సెల్‌ఫోన్ అపహరించారు. దీనిపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం లింగాయాపాలెం ప్లాట్లు ప్రాంతానికి చెందిన వేముల నాగరాజును ఈ నెల 3వ తేదీన అరెస్టు చేసిన రాజుపాలెం పోలీసులు విచారణ చేపట్టగా తనతోపాటు తమ ప్రాంతానికే చెందిన 2లో



మాట్లాడుతున్న గాంధీజీ కింగ్ ఫౌండేషన్ ప్రతినిధి సర్వోదయ ప్రసాద్

ఆదర్శవంతం.. గాంధీజీ జీవితం

ప్రజాశక్తి - మేడికొండూరు : గాంధీజీ జీవితం సమాజానికి ఒక గొప్ప ఆదర్శ వంత మని గాంధీజీ కింగ్ ఫౌండేషన్ ఇండియా ప్రతినిధి ప్రొఫెసర్ సర్వోదయ ప్రసాద్ అన్నారు. మండలంలోని విసదల అడ్డరోడ్డు వద్ద గల ఎన్ఆర్ఐ ఐటి ఇంజనీరింగ్ కళాశాలలో 'గాంధీజీ జీవితం సమాజానికి చూపిన ఒక మంచి మార్గం'పై విద్యార్థులకు అవగాహన సదస్సు శుక్రవారం జరిగింది. కళాశాలలోని సిఎస్ఇ బ్రాంచ్ ప్రొఫెసర్ సుజాత అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గాంధీజీ కింగ్ ఫౌండేషన్ ఇం డియా ప్రతినిధి ప్రొఫెసర్ జి.సర్వోదయ ప్రసాద్ మాట్లాడుతూ గాంధీజీ చిన్ననాటి జీవితాన్ని విద్యార్థులకు వివ రించారు. జీవితంలో ఎప్పుడూ కూడా ఒక్క అబద్ధం కూడా ఆడని వ్యక్తి గాంధీజీ అని తెలిపారు. జీవితమంతా ఒక తెంచిన పుస్తకం లాంటిదని తెలిపారు. కళాశాల కర స్పాండెంట్ సెక్రెటరీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ 'నా జీవితమే నా సందేశం' అని తెలిపిన ఏకైక వ్యక్తి గాంధీజీ అని, అహింసా వాదాన్ని ప్రపంచానికి ఒక మార్గం నిర్దేశంగా తెలియజేసిన వ్యక్తి అని తెలిపారు. డాక్టర్ కోట శ్రీనివాసు, ఏవో బి.సీతారామయ్య, ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి పి.రవికుమార్, డాక్టర్ చంద్రమౌళి, కేఎస్ఆర్, అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.



సంక్రాంతి పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-తాడేపల్లి : సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ప్రజాసంఘాల ఆధ్వర్యంలో వివిధ రకాల ఆటల పోటీలు శుక్రవారం స్థానిక సుందరయ్యనగర్‌లో ప్రారంభమయ్యాయి.మొదటిరోజు ముగ్గుల పోటీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున మహిళలు పాల్గొన్నారు. గెలుపొందిన వారికి సంక్రాంతి పండుగ రోజున జరిగే సభలో బహుమతులు అందజేయ నున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఫిబ్రవరి 9,10 తేదీల్లో యూనివర్సల్ కళాశాలలో యూనిక్వెస్ట్ 2కె-23

ప్రజాశక్తి - మేడికొండూరు : మండలంలోని పేరేచర్ల నరసరావుపేట రోడ్ లోని యూని వర్సల్ ఇంజనీరింగ్ కళాశాల శుక్రవారం విలేకరుల సమావేశం జరిగింది. డయాసిస్ ఆఫ్ గుంటూరు సొసైటీ వారిచే 2008 లో ప్రారంభించబడిన యూనివర్సల్ కళాశాల, నాక్, ఐఎస్ఓ వంటి ప్రామాణిక సంస్థల గుర్తింపుతో నాణ్యమైన ఇంజనీరింగ్ విద్యను అందించేందుకు కృషి చేస్తున్నట్లు ఇంజనీరింగ్ కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ రెవరెండ్ ఫాదర్ మాలపాటి మరెడ్డి తెలిపారు. యూనిక్వెస్ట్ 2కె-23 పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2010 నుండి ఈ యూని క్వెస్ట్ నిర్వహిస్తున్నామని క్రమేపీ దానికి ఆదరణ పెరుగు తోందని చెప్పారు. ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్ కేశవరెడ్డి మాట్లాడుతూ ఫిబ్రవరి 9, 10 తేదీల్లో యూనిక్వెస్ట్ - 2కె-23 ను ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నామన్నారు.

జిఒ 1 ప్రతులు దహనం

ప్రజాశక్తి-తాడేపల్లి : రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రజాస్వామ్య హక్కులను హరించే జిఒ 1ని రద్దు చేయా లని నులకపేట ఆటోడ్రైవర్స్ అండ్ ఓనర్స్ యూనియన్, ప్రగతిశీల కార్మిక సంఘం ఆధ్వ ర్యంలో శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. నులక పేటలో జిఒ కాపీలను దహనం చేశారు. కార్మిక సమైఖ్య జిల్లా నాయకులు కొండారెడ్డి, ఆటో యూనియన్ అధ్యక్షులు ఎస్‌కె సైదులు, ఎస్‌కె జాన్‌సైదా, శ్రీను, వరుణ్, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

అధ్వానంగా ధాన్యం కొనుగోలు

- రవాణాకు కాంట్రాక్టర్ నియామకం ఏది
- ప్రైవేటు వ్యాపారులకే పంటనమ్మి నష్టపోతున్న రైతులు
- కౌలురైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు
- పలు గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో పరిశీలన

ప్రజాశక్తి - దుగ్గిరాల

ధాన్యం కొనుగోలులో అధికారు తీరు అధ్వానంగా ఉందని, ఇది రైతులకు తీవ్ర నష్టం చేస్తోందని కౌలురైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు విమర్శించారు. మండలంలోని చిలువూరు, పెనుమూలి గ్రామాల్లో రైతు, కౌలురైతు సంఘాల నాయకులు శుక్రవారం పర్యటించారు. రైతులతో మాట్లాడ్డంతోపాటు రైతు భరోసా కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఎం.హరిబాబు మాట్లాడుతూ కొన్ని జిల్లాల్లో ధాన్యం రవాణాకు ప్రభుత్వం కాంట్రాక్టర్లను నియమించినా గుంటూరు జిల్లాలో మాత్రం ఇంకా నియమించలేదని, రవాణా ఖర్చులను రైతులే భరించాల్సి వస్తోందని అన్నారు. ధాన్యం కొనుగోలులో అనవసర నిబంధనలు పెడుతున్న అధికారులు అవసరమైన ఏర్పాట్లు మాత్రం చేకకపోవడంతో రైతులు బస్తాకు రూ.100-250 వరకూ నష్టపోతున్నారని మండిపడ్డారు. పెనుమూలి రైతు భరోసా కేంద్రంలో గోతాలే లేవని, కాటా కూలి, రవాణా ఖర్చులను రైతులే భరించాల్సి రావడంతో కొనుగోలు కేంద్రంపై రైతులకు నమ్మకం సన్నగిల్లిందని చెప్పారు. ప్రైవేటు వ్యాపారులకే పంటను అమ్ముకోవాల్సిన దుస్థితి నెలకొందని తెలిపారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఒకటి చెబుతుండగా క్షేత్రస్థాయిలో మరోవిధంగా ఉందన్నారు. రబీ సాగు ప్రారంభమైనా ధాన్యం అమ్మిన రైతులకు డబ్బులు సకాలంలో అందడం లేదని, గతేడాది అనుభావాల దృష్ట్యానూ ప్రైవేటు వ్యాపారులకే పంటను రైతులు అమ్ముకుంటున్నారని అన్నారు. ప్రభుత్వం, అధికారుల తీరుతో ఒక్కో రైతు ఎకరాకు రూ.25-30 వేలు నష్టపోతున్నారని ఆవేదన వెలిబుచ్చారు. ప్రభుత్వం, అధికారు ఇప్పటికైనా స్పందించాలని, నిబంధనలను పక్కనపెట్టి ధాన్యం మొత్తాన్నీ మద్దతు ధరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.శ్రీనివాసరావు, నాయకులు ఎం.నాగమల్లేశ్వరరావు, బి.అమ్మిరెడ్డి, వి.సాంబశివరావు, ఎన్.యోగేశ్వరరావు పాల్గొన్నారు.



రైతు భరోసా కేంద్రం సిబ్బందితో మాట్లాడుతున్న నాయకులు



సత్తెనపల్లి ఏరియా ఆస్పత్రిలో రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

ప్రభుత్వ వైద్యశాలల్లో విజిలెన్సు తనిఖీలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఉమ్మడి గుంటూరు జిల్లాలోని పలు ప్రభుత్వాస్పత్రుల్లో శుక్రవారం తనిఖీలు చేపట్టారు. గుంటూరు రీజనల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ఎస్.వి.మాధవ్‌రెడ్డి పర్యవేక్షణలో వట్టిచెరుకూరు, కాట్రపాడు, పెదనందిపాడు, నగరం, కావూరు, చెరుకుపల్లి, సత్తెనపల్లి, ఫణిదం తదితర ప్రభుత్వ వైద్యశాలల్లో తనిఖీ చేశారు. డాక్టర్ల హాజరు, పనితీరు, మందుల పంపిణీ, వసతులు, సౌకర్యాలు, రికార్డుల నిర్వహణ, పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలను పరిశీలించారు. నాణ్యత పరిశీలన నిమిత్తం మందుల నమూనాలను సేకరించారు. తనిఖీల్లో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీహరిరావు, తహశీల్దార్ కె.నాగమల్లేశ్వరరావు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వై.శివనారాయణ, వ్యవసాయాధికారి వాసంతి, ఎస్ఐ ఎం.రామచంద్రయ్య, అసిస్టెంట్ జియాలజిస్ట్ ఎన్.ప్రసాద్, ఎఫ్ఆర్ఒ సైదులు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న నిర్వహణ కమిటీ చైర్మన్ ఆలపాటి రాజేంద్రప్రసాద్

నేడు మాధవిపెద్ది సత్యం శత జయంతుత్సవం

పురస్కారాలను అందుకోనున్న గాయని శైలజ, సంగీత దర్శకులు సురేష్

ప్రజాశక్తి-తెనాలి

ప్రముఖ సినీ నేపథ్య నాయకులు మాధవపెద్ది సత్యం శతజయంతి ఉత్సవాన్ని ఈనెల 7న స్థానిక నాజరుపేటలోని ఎన్విఆర్ కన్వెన్షన్‌లో సాయంత్రం 5 గంటలకు నిర్వహించనున్నట్లు నిర్వహణ కమిటీ చైర్మన్ ఆలపాటి రాజేంద్రప్రసాద్ చెప్పారు. సత్యం కుమారుడు, శివ ఫౌండేషన్ నిర్వాహకులు మాధవ పెద్ది మూర్తి సంకల్పంతో కార్యక్రమం నిర్వహిస్తున్నామని, మాధవ పెద్ది పురస్కారాలను శివ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రముఖ సినీ నేపథ్య గాయని ఎస్పీ శైలజ, సినీ సంగీత దర్శకులు మాధవ పెద్ది సురేష్‌కు అందిం చనున్నామన్నారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా శాసనసభ మాజీ డిప్యూటీ స్పీకర్ మండలి బుద్ధ ప్రసాద్, గౌరవ అతిథులుగా తానా మాజీ అధ్యక్షులు డాక్టర్ టి ప్రసాద్, ఆత్మీయ అతిథులుగా రామినేని ఫౌండేషన్ కన్వీనర్ పాతూరి నాగభూషణం, చైర్మన్ ధర్మ ప్రచారక్ రామినేని, సినీనటి సిహెచ్ జయ లలిత, గుంటూరు కళాధర్బార్ అధ్యక్షులు డాక్టర్ రంగారావు పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా సినీ సంగీత విభావరి కూడా ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు.

9న కౌండిన్య ఐఎఎస్ అకాడమీ ప్రారంభోత్సవం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

కౌండిన్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్ స్కాలర్‌షిప్‌ల ప్రదానోత్సవం, కౌండిన్య ఐఎఎస్ అకాడమీ ప్రారంభోత్సవం ఈనెల 9వ తేదీన గుంటూరుకు చెందిన ట్రస్టు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గౌవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ హాజరుఅవుతారని కౌండిన్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్ మరియు గౌడజన సేవాసమితి ట్రస్ట్‌ల వ్యవస్థాపక అధ్యక్షులు ఇ.వి.నారాయణ శుక్రవారం ఎస్.హెచ్.ఒ సమావేశ మందిరంలో విలేకర్లకు తెలిపారు. కౌండిన్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ప్రతిభ కలిగిన పేద గౌడ, శెట్టి బలిజ, ఈడిగ, యాత, శ్రీశైన ఇతర నిరుపేద వర్గాలకు చెందిన విద్యార్థులకు 18 ఏళ్ల నుండి స్కాలర్ షిప్ ల బహుకరణ జరుగుతుందన్నారు. 2006 నుంచి స్కాలర్‌షిప్‌లను అందిస్తున్నామన్నారు. 6 వేల మంది విద్యార్థులకు ఒక కోటి 50 లక్షలు ఇచ్చినట్టు తెలిపారు. ప్రస్తుత విద్యాసంవత్సరంకు 450 మంది విద్యార్థులకు రూ.18 లక్షల అందచేస్తామన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగ శిక్షణా తరగతులు నిర్వహించాలనే లక్ష్యంతో గౌడ జన సేవా సమితిని ప్రారంభించామని, ఈ సంస్థ ద్వారా కౌండిన్య ఐఏఎస్ అకాడమీ ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. గౌడ జన సేవా సమితి వ్యవస్థాపక బృందం వెనిగండ్ల గ్రామం వద్ద కౌండిన్య పురంలో అనేక మంది దాతల సహకారంతో భవన నిర్మాణం జరుగుతుందన్నారు.

ఏళ్లతరబడి గ్రావెల్ అక్రమ తవ్వకాలు

(మొదటి పేజీ తరువాయి)

ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితి ఏర్ప డింది. ఎట్టకేలకు కొద్దిసేపటి తర్వాత ఆయన్ను పోలీసులు పొన్నూరు మండలం చింతల పూడిలోని ఆయన నివాసానికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా నరేంద్ర కుమార్ మాట్లాడుతూ అక్రమ మైనింగ్‌పై తాను మూడు న్నరేళ్ల నుండి పలుమార్లు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదన్నారు. రైల్వే కాంట్రాక్ట్ పేరు మీద 150 అడుగుల వరకు నిబంధనలు మీరి గ్రావెల్‌ను తవ్వి తరలిస్తు న్నారని, ఇందుకు అధికారులు సైతం సహకరిస్తున్నారని ఆరోపించారు. తాను సందర్శనకు వచ్చినప్పుడల్లా అది.కారులు అక్రమార్కులకు నామమాత్రపు ఫైన్లతో సరిపెడుతున్నారని అన్నారు. దీని పై పూర్తి స్థాయి విచారణ చేపట్టి అక్ర మార్కులను కట్టడి చేయాలని డిమాండ్ చేశారు.

ఐద్వా జెండావిష్కరణ

(మొదటి పేజీ తరువాయి)

పెంచడంతోపాటు పట్టణాల్లోనూ అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహిళలపై దాడులకు ప్రధాన హేతువుగా ఉన్న మద్యాన్ని నియంత్రించాలన్నారు. ఈ సమస్యలన్నింటిపైనా జాతీయ మహాసభలో చర్చించి భవిష్యత్ పోరాటాలపై కార్యాచరణ రూపొందించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆయేషా, ఫాతిమా, మస్తానీ,సైదాబీ పాల్గొన్నారు.

చోరీ కేసులో ముఠా అరెస్టు

(మొదటి పేజీ తరువాయి)

అంగడి ప్రకాష్, ఎన్నాబత్తిన శ్రీను, కొమ్మా నాగశ్రీను, అంగడి శ్రీను కూడా చోరీలో పాల్గొన్నట్లు అంగీకరించాడు. వీరినీ గురువారం సత్తెనపల్లి - గుంటూరు రోడ్డులో నందిగం అడ్డరోడ్డు వద్ద పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల నుండి రూ.10.10 లక్షలు, ద్విచక్ర వాహ నం స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరుపరుస్తామని ఎస్పీ చెప్పారు. వీరిపై ప్రత్తిపాడు పోలీస్ స్టేషన్‌లోనూ పలు కేసులు నమోదైనట్లు ఎస్పీ తెలిపారు. సమావేశంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) జి.బిందుమాధవ్, సత్తెనపల్లి డీఎస్పీ, బి.ఆదినారాయణ, సత్తెనపల్లి రూరల్ సిఐ ఆర్.ఉమేష్, రాజుపాలెం ఎస్ఐ షేక్ మొహమ్మద్ షఫీ సిబ్బంది పాల్గొన్నారు.

మళ్లీ వచ్చి పట్టుబడి..

ఇదిలా ఉండగా గతేడాది ఆగస్టులో తన ఇంట్లో చోరీ అనంతరం గణేష్ నర్సరీ యజమాని పగడాల సాంబయ్య తన ఇంటి చుట్టూ సిసి కెమెరాలు పెట్టించుకున్నారు. గతంలో చోరీకి పాల్పడిన ముఠాలో ఒకడైన వేముల నాగరాజు మళ్లీ డిసెంబర్ 22న రాత్రి 12 గంటలకు చోరీకి వచ్చాడు. ఆ ఇంటి ప్రాంగణంలో సంచరించడం, గేటు ఎక్కటం, దిగటం చేశాడు. ఇది గమనించిన సాంబయ్య వెంటనే తన నర్సరిలోని సిబ్బందికి సమాచారం ఇచ్చాడు. వారు అక్కడికి రావడంతో గమనించిన నాగరాజు పరారయ్యాడు. రాజుపాలెం శివారులోని గ్యాస్ గోదాము వద్దకు చేరుకుని అటుగా వెళ్లే వాహనాలను లిఫ్ట్ అడుగుతూ ఒక లారీని ఎక్కాడు. ఇది చూసిన నర్సరి సిబ్బంది.. లారీని వెంబడిస్తూనే రాజుపాలెం పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ విషయాన్ని సత్తెనపల్లి పోలీసులకు రాజుపాలెం పోలీసులు తెలిపారు. దీంతో సత్తెనపల్లి మండలం దూళిపాళ్ల వద్ద లారీని నిలిపేసిన పోలీసులు నిందితుణ్ణి అదుపులోకి తీసుకున్నారు.

మహారాజశ్రీ నరసరావుపేట అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఐ.పి.నెం.53 / 2022

Between :
గోదవర్తి సత్యనారాయణ, తండ్రి వెంకట్రావు, వయస్సు 49సం.లు, డోర్ నెం.6-37, ఇర్లపాడు గ్రామము, పోట్లూరు పంచాయతి, శావల్యాపురం మండలం, పల్నాడు జిల్లా. ..... పిటీషనర్

Vrs

1. మాఘం సాంబశివరావు, తండ్రి: ఆంజనేయులు, వయస్సు 40 సం.లు, ఇర్లపాడు గ్రామము, శావల్యాపురం మండలం, పల్నాడు జిల్లా.
2. బిక్కి రామాంజనేయులు, తండ్రి: పేరయ్య, వయస్సు 55 సం.లు, ఇర్లపాడు గ్రామము, శావల్యాపురం మండలం, పల్నాడు జిల్లా.
3. దగ్గుబాటి చంద్రయ్య, తండ్రి : చెంచురామయ్య, వయస్సు 70 సం.లు, ఇర్లపాడు గ్రామము, శావల్యాపురం మండలం, పల్నాడు జిల్లా.
4. బొప్పూడి వెంకటేశ్వర్లు, తండ్రి : చిన వెంకయ్య, వయస్సు 55 సం.లు, ఇర్లపాడు గ్రామము, శావల్యాపురం మండలం, పల్నాడు జిల్లా.
5. వెలగపూడి అంజమ్మ, భర్త: వెంకట్రావు, వయస్సు 50 సం.లు, ఇర్లపాడు గ్రామము, శావల్యాపురం మండలం, పల్నాడు జిల్లా.
6. నెలకుడితి వాసు, తండ్రి: భాస్కరరావు, వయస్సు 55 సం.లు, ఇర్లపాడు గ్రామము, శావల్యాపురం మండలం, పల్నాడు జిల్లా.
7. బిక్కి వేణు, తండ్రి: లక్ష్మయ్య, వయస్సు 42 సం.లు, ఇర్లపాడు గ్రామము, శావల్యాపురం మండలం, పల్నాడు జిల్లా.
8. జాగర్లమూడి సాంబయ్య, తండ్రి: వీరభద్రయ్య, వయస్సు 60 సం.లు, ఇర్లపాడు గ్రామము, శావల్యాపురం మండలం, పల్నాడు జిల్లా.
9. దగ్గుబాటి వెంకట్రావు, తండ్రి: రామశేషయ్య, వయస్సు 55 సం.లు, ఇర్లపాడు గ్రామము, శావల్యాపురం మండలం, పల్నాడు జిల్లా.
10. జాగర్లమూడి సుజాత, భర్త: నాగేశ్వరరావు, వయస్సు 39 సం.లు ఇర్లపాడు గ్రామము, శావల్యాపురం మండలం, పల్నాడు జిల్లా.
11. మెడబలిమి దాసయ్య, తండ్రి: చిన్నయ్య, వయస్సు 79 సం.లు ఇర్లపాడు గ్రామము, శావల్యాపురం మండలం, పల్నాడు జిల్లా.
12. యరమాసు రంగ, భర్త: వెంకట్రావు, వయస్సు 33 సం.లు ఇర్లపాడు గ్రామము, శావల్యాపురం మండలం, పల్నాడు జిల్లా.
13. యరమాసు సైదమ్మ, భర్త: వెంకట్రావు, వయస్సు 45 సం.లు ఇర్లపాడు గ్రామము, శావల్యాపురం మండలం, పల్నాడు జిల్లా.
14. రాయపాటి శ్రీధర్, తండ్రి: ప్రసాద్, వయస్సు 38 సం.లు ఇర్లపాడు గ్రామము, శావల్యాపురం మండలం, పల్నాడు జిల్లా.
15. వెలిగండ్ల సాంబయ్య, తండ్రి: సోమయ్య, వయస్సు 75 సం.లు ఇర్లపాడు గ్రామము, శావల్యాపురం మండలం, పల్నాడు జిల్లా.
16. పారా కోటేశ్వరరావు, తండ్రి: గాలెయ్య, వయస్సు 33 సం.లు ఇర్లపాడు గ్రామము, శావల్యాపురం మండలం, పల్నాడు జిల్లా.
17. కొర్రపాటి వెంకట్రావు, తండ్రి: రామయ్య, వయస్సు 55 సం.లు కొర్రపాటివారిపాలెం, తాళ్ళూరు మండలం, ప్రకాశం జిల్లా.
18. వట్టికూటి మురళీకృష్ణ, తండ్రి: మోహనరావు, వయస్సు 40 సం.లు, హౌస్ నెం.# 124, భాగ్యనగర్ క్యాంప్, లక్కం చిన్ని పోస్టు, మాన్వావి తాలూక, రాయచూర్ జిల్లా, కర్నాటక.
19. అన్నంరెడ్డి ధనలక్ష్మి, భర్త: వెంకట్రావు, వయస్సు 52 సం.లు తలార్లపల్లి గ్రామము, నూజండ్ల మండలం, పల్నాడు జిల్లా.
20. కాకుమాను రామకోటేశ్వరరావు, తండ్రి: కృష్ణమూర్తి, వయస్సు 60 సం.లు, బొగ్గరం గ్రామము, ఈపూరు మండలము, పల్నాడు జిల్లా.
21. నీలమాటి శ్రీను, తండ్రి: వెంకట్రావు, వయస్సు 34 సం.లు, శ్రీరాంనగర్ గ్రామము, పానకాలపాలెం పోస్టు, వినుకొండ మండలం, పల్నాడు జిల్లా.
22. కాసరగడ్డ కోటేశ్వరరావు, తండ్రి : తెలియదు, వయస్సు 42 సం.లు రెడ్డినగర్, వినుకొండ టౌన్, పల్నాడు జిల్లా.
23. వట్టికూటి వీర్రాజు, తండ్రి: బాపిరాజు, వయస్సు 60 సం.లు శావల్యాపురం గ్రామము మరియు మండలం, పల్నాడు జిల్లా.
24. గోనుగుంట్ల మస్తాన్రావు, తండ్రిః లింగయ్య, వయస్సు 50 సం.లు పోట్లూరు గ్రామము, శావల్యాపురం మండలము, పల్నాడు జిల్లా.
25. ముంద్రు అప్పారావు, తండ్రి: చంద్రయ్య, వయస్సు 60 సం.లు వేల్పూరు గ్రామము, శావల్యాపురం మండలము, పల్నాడు జిల్లా.
26. చిలకల ప్రభావతి, భర్త: నాగేశ్వరరావు, వయస్సు 52 సం.లు మునిసిపల్ కాంప్లెక్స్ కిరాణా షాపు, వినుకొండ టౌన్, పల్నాడు జిల్లా.
27. కోట తిరుమలరావు, తండ్రిః కృష్ణమూర్తి, వయస్సు 48 సం.లు డోర్ నెం.1-35-149, మారుతినగర్, గుంటూరు పట్టణం, గుంటూరు జిల్లా.
28. ధూళిపాళ్ళ సుబ్బారావు, తండ్రి: రాములు, వయస్సు 55 సం.లు తాటివారిపాలెం గ్రామము, మార్టూరు మండలము, ప్రకాశం జిల్లా.
29. ధూళిపాళ్ళ శ్రీను, తండ్రి: సుబ్బారావు, వయస్సు 35 సం.లు ఇర్లపాడు గ్రామము, శావల్యాపురం మండలం, పల్నాడు జిల్లా.
30. బిక్కి కోటయ్య, తండ్రి : వీరయ్య, వయస్సు 80 సం.లు, ఇర్లపాడు గ్రామము, శావల్యాపురం మండలం, పల్నాడు జిల్లా.
31. విక్రం వేణు, తండ్రి: రామచంద్రరావు, వయస్సు 35 సం.లు డోర్ నెం.10-14-30, ఆకులవారి వీధి, మల్లిఖార్జునపేట విటిసి విజయవాడ అర్బన్, కృష్ణా జిల్లా.
32. ధనేకుల అనీల్ కుమార్, తండ్రి: రాధాకృష్ణ, వయస్సు 29 సం.లు ఇర్లపాడు గ్రామము, శావల్యాపురం మండలం, పల్నాడు జిల్లా.
33. గంధం నరేంద్ర, తండ్రిః శివ, వయస్సు 22 సం.లు పిన్నెల్లి గ్రామము, మాచవరం మండలం, పల్నాడు జిల్లా.
34. గొట్టిపాటి శ్రీను, తండ్రిః చంద్రయ్య, వయస్సు 48 సం.లు కృష్ణాపురం గ్రామము, శావల్యాపురం మండలము, పల్నాడు జిల్లా.
35. చింతా రమేష్, తండ్రిః అంజయ్య, వయస్సు 40 సం.లు బొగ్గరం గ్రామము, ఈపూరు మండలము, పల్నాడు జిల్లా.
36. కొర్రపాటి శ్రీనివాసరావు, తండ్రిః (లేటు) సుబ్బారావు, వయస్సు 60సం.లు, ఇర్లపాడు గ్రామము, శావల్యాపురం మండలం, పల్నాడు జిల్లా.
37. నన్నపనేని శివయ్య, తండ్రి: వెంకయ్య, వయస్సు 65 సం.లు ఇర్లపాడు గ్రామము, శావల్యాపురం మండలం, పల్నాడు జిల్లా.
38. అఫీసియల్ రిసీవర్, జిల్లా కోర్టు కాంప్లెక్స్, గుంటూరు పట్టణం, గుంటూరు జిల్లా. ... రెస్పాండెంట్స్

పైన తెలిపిన ఐ.పి.లో పిటీషనరు దివాలా దారుగా ప్రకటించుకొనుటకు దాఖలు చేసివున్నారు. పైన తెలిపిన దాఖలా ది.23.01.2023న ప్రతివాదులు నోటీసు నిమిత్తం వాయిదా వేయబడియున్నది. ఇందుమూలముగా ప్రతివాదులందరికి తెలియజేయునది ఏమనగా పైన ఉదహరించిన తారీకున ప్రతివాదులందరు పైన తెలిపిన కోర్టుకు హాజరు అయి వారి వారి అభ్యంతరములు తెలియజేసుకొనవలసినదిగా తెలియజేయడమైనది. పైన ఉదహరించిన తారీకున ప్రతివాదులు కోర్టుకు హాజరు కాని యెడల కోర్టువారు ప్రతివాదులకు అభ్యంతరము లేదని భావించి తగు చర్యలు తీసుకొనెదరు.
వాయిదా తేది : 23.01.2023

ఇట్లు
Y.సురేష్ బాబు
K.S.M.V.నాయుడు
V.అమర్‌బాబు
పిటీషనర్ తరపు న్యాయవాదులు
నరసరావుపేట & వినుకొండ.

ప్రకటన

నా క్లయింట్ మంగళగిరి వాస్తవ్యులు అయిన లేటు వూట్ల నాగేశ్వరరావు గారి కుమారుడు వూట్ల శివశంకరరావు వయస్సు 48 సం॥లు, వారి సంజాయిషీ పొంది యావన్మందికి తెలియజేయునది ఏమనగా మా క్లయింట్ తండ్రి గారైన వూట్ల నాగేశ్వరరావు గారు వారి జీవిత కాలములో వారి స్వార్జితముగా సంపాదించిన ఆస్తులను గురించి ది. 05-02-2020వ తేదీన మంగళగిరి సబ్ రిజిస్ట్రారు వారి ఆఫీసులో 3వ పుస్తకం, నెం.21 ఆఫ్ బుక్ 3/2020రుగా వీలునామా రిజిష్టరు చేసియున్నారు. సదరు వూట్ల నాగేశ్వరరావు గారు ది.28-03-2020న స్వర్గస్తులైనారు. సదరు వీలునామా ప్రకారం ఈ దిగువ షెడ్యూలు ఆస్తి నా క్లయింట్‌నకు సంక్రమించినది. మా క్లయింట్ పట్టాదారు పాస్‌పుస్తకం పొందుటకు శ్రీయుత మంగళగిరి తహశీల్దార్ గారికి దరఖాస్తు చేయడమైనది. దీనిపై ఏమైనా అభ్యంతరములు కాని ఆక్షేపణలు గాని వున్నయెడల ఈ ప్రకటన తేదీ నుండి వారం రోజులలోపు తహశీల్దార్ వారి కార్యాలయంలో తెలియపరచగలరు. అలా కాని యెడల నా క్లయింట్‌నకు యీ వీలునామా ద్వారా సంక్రమించిన స్థిరాస్తిలన్నింటికి సంపూర్ణ స్వాధీన హక్కులు కలిగియుండునని తెలియజేయడమైనది.

షెడ్యూలు

1. మంగళగిరి మండలం, ఆత్మకూరు గ్రామం తాలూకు సర్వే నెం.91/A రు దాఖలా య.0.53 శెంట్లు మాగాణి భూమికి హద్దులు :
తూర్పు : దామర్ల శోభన్‌బాబు గారి భూమి, దక్షిణం : మాణెం సుబ్బారావుగారి భూమి, పడమర : పంట కాలువ హద్దు : ఉత్తరం : జొన్నాదుల చలపతిరావు గారి భూమి.
2. మంగళగిరి మండలం, ఆత్మకూరు గ్రామం తాలూకు సర్వే నెం. 65-2E2రు దాఖలా య.0.92 1/2 శెంట్లు సర్వే నెం.65-2C2రు దాఖలా య.0.02 శెంట్లు వెరశి య.0.94 1/2 శెంట్లు మాగాణి భూమికి హద్దులు.
తూర్పు : నేహా సేథియా గారి భూమి, దక్షిణం : తెనాలి రోడ్డు, పడమర : పూట్ల పెదసుబ్బారావు గారి భూమి హద్దు, ఉత్తరం : గోలి నాగేశ్వరరావు వగైరాల భూమి.
3. మంగళగిరి మండలం, ఆత్మకూరు గ్రామం తాలూకు సర్వే నెం.100/A రు దాఖలా య.0.43 శెంట్లు మాగాణి భూమికి హద్దులు.
తూర్పు : జాయింటు పంట కాలువ, దక్షిణం : మసీదు మహమ్మద్ యీసోబ్ సాహెబ్ గారి భూమి, పడమర : కాంతం సూరమ్మ గారి భూమి, ఉత్తరం : వల్లం కాటంరాజు గారి భూమి.

ఇట్లు
వూట్ల సత్యనారాయణ, ఎం.కాం., ఎల్ఎల్.బి.,
అడ్వకేట్,
డోర్ నెం.5-512, తెనాలిరోడ్డు, మంగళగిరి.

ప్రకటన

నా క్లయింట్ మంగళగిరి వాస్తవ్యులు అయిన లేటు వూట్ల నాగేశ్వరరావు గారి కుమారుడు వూట్ల పెద సుబ్బారావు వయస్సు 53 సం॥లు, వారి సంజాయిషీ పొంది యావన్మందికి తెలియజేయునది ఏమనగా మా క్లయింట్ తండ్రి గారైన వూట్ల నాగేశ్వరరావు గారు వారి జీవిత కాలములో వారి స్వార్జితముగా సంపాదించిన ఆస్తులను గురించి ది. 05-02-2020వ తేదీన మంగళగిరి సబ్ రిజిస్ట్రారు వారి ఆఫీసులో 3వ పుస్తకం, నెం.21 ఆఫ్ బుక్ 3/2020రుగా వీలునామా రిజిష్టరు చేసియున్నారు. సదరు వూట్ల నాగేశ్వరరావు గారు ది.28-03-2020న స్వర్గస్తులైనారు.సదరు వీలునామా ప్రకారం ఈ దిగువ షెడ్యూలు ఆస్తి నా క్లయింట్‌నకు సంక్రమించినది. మా క్లయింట్ పట్టాదారు పాస్‌పుస్తకం పొందుటకు శ్రీయుత మంగళగిరి తహశీల్దార్ గారికి దరఖాస్తు చేయడమైనది. దీనిపై ఏమైనా అభ్యంతరములు కాని ఆక్షేపణలు గాని వున్నయెడల ఈ ప్రకటన తేదీ నుండి వారం రోజులలోపు తహశీల్దార్ వారి కార్యాలయంలో తెలియపరచగలరు. అలా కాని యెడల నా క్లయింట్‌నకు యీ వీలునామా ద్వారా సంక్రమించిన స్థిరాస్తిలన్నింటికి సంపూర్ణ స్వాధీన హక్కులు కలిగియుండునని తెలియ జేయడమైనది.

షెడ్యూలు

1. మంగళగిరి మండలం, ఆత్మకూరు గ్రామం తాలూకు సర్వే నెం.102 రు దాఖలా య.0.83 1/2 శెంట్లు మాగాణి భూమికి హద్దులు :
తూర్పు :నల్లగొర్ల గంగాధరరావు వగైరాల భూమి, దక్షిణం వూట్ల చినసుబ్బారావు గారి భూమి హద్దు. పడమర : పంట కాలువ హద్దు ఉత్తరం : గుంటూరు సుబ్బయ్యగారి భూమి హద్దు.
2. మంగళగిరి మండలం, ఆత్మకూరు గ్రామం తాలూకు సర్వే నెం. 65-2E2రు దాఖలా య.0.94 1/2 శెంట్లు మాగాణి భూమికి హద్దులు.
తూర్పు : వూట్ల శివశంకరరావుగారి భూమి. దక్షిణం : తెనాలి రోడ్డు, పడమర సాక్షి పత్రిక వారి భూమి హద్దు, ఉత్తరం : చావలి వెంకట లక్ష్మి నరసింహమూర్తి వగైరాల భూమి.
3. మంగళగిరి మండలం, చినవడ్లపూడి గ్రామం తాలూకు సర్వే నెం.45 రు దాఖలా య.0.48 1/2 శెంట్లు మాగాణి భూమికి హద్దులు.
తూర్పు : సర్కారు పోరంబోకు భూమి హద్దు, దక్షిణం అన్నె శ్రీనివాస చక్రవర్తి గారి భూమి, పడమరం : వల్లభనేని శంకరం వగైరాల భూమి, ఉత్తరం అన్నే చంద్రశేఖరరావు గారి భూమి, తి.తూ :- మన్నే సుబ్బారావుగారి భూమి, తి.వు:- మన్నే సుబ్బారావు గారి భూమి.

ఇట్లు
వూట్ల సత్యనారాయణ, ఎం.కాం., ఎల్ఎల్.బి.,
అడ్వకేట్,
డోర్ నెం.5-512, తెనాలిరోడ్డు, మంగళగిరి.

ఉండవల్లిలో కిడ్నాప్ వదంతులు

ప్రజాశక్తి-తాడేపల్లి: ఉండవల్లిలో శుక్రవారం యువకుడు కిడ్నాప్ అంటూ పెద్దఎత్తున వదంతులు వ్యాపించాయి.దీంతో పోలీసులు అప్ర మత్తమయ్యారు. కిడ్నాప్ అంటూ ఏమీలేదని పోలీసులు తమ విచారణలో తేల్చారు. ఒక బాకీ విషయమై ఇరువర్గాల మధ్య వాగ్వివాదం జరిగి ఉండవల్లిలోని వ్యక్తిని విజయవాడకు తీసుకెళ్లారని పోలీసులు నిర్ధారించారు. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. దీనికి సంబధించి తాడేపల్లి సిఐ శేష గిరిరావు తెలిపిన వివరాల ప్రకారం, ఉండవల్లికి చెందిన నరేష్ విజయవాడ గట్టు వెనుక ప్రాంతానికి చెందిన బండి శ్రీను వద్ద సెంట్రింగ్ పని చేస్తున్నాడు. శ్రీను దగ్గర ఉన్న ద్విచక్ర వాహనాన్ని తీసుకుని మరుసటి రోజు ఇస్తానని చెప్పిన నరేష్, ఫైనాన్స్ కంపెనీలో తాకట్టు పెట్టాడు. వాహనం ఇవ్వ కుండా, ఫోన్ లిఫ్ట్ చేయకుండా ఇబ్బంది పెడుతున్న నరేష్ ఇంటికి శుక్రవారం శ్రీను తన ఇద్దరు స్నేహితులతో కలిసి వెళ్లాడు. నరేష్‌ను తమ ద్విచక్ర వాహనం గురించి అడిగారు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య మాటామాటా పెరిగింది. తాకట్టు పెట్టానని చెప్పడంతో శ్రీను, అతని స్నేహితులు నరేష్‌ను విజయవాడ తీసుకెళ్లారు. స్థానికులు ఇది కిడ్నాప్ అనుకుని పోలీసులకు సమాచారం అందించారు. బాధితుడి భార్య తాడేపల్లి పోలీస్‌స్టేసన్‌లో ఫిర్యాదు చేసింది. దీనిపై విచారించిన పోలీసులు ఇది కిడ్నాప్ కాదని తేల్చారు. ప్రస్తుతం ఇద్దరు తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఉన్నారు. తాడేపల్లి సిఐ శేషగిరిరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పట్టుబడ్డ వాహనాలకు నేడు వేలం

ప్రజాశక్తి - అచ్చంపేట

పట్టుబడిన వాహనాలకు అచ్చంపేట పోలీస్ స్టేషన్‌లో శనివారం వేలం వేయనున్నట్లు అచ్చంపేట ఎస్సై కె.రవీంద్ర శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీస్ స్టేషన్ పరిధిలో గత కొంత కాలంగా నాటు సారా, మద్యం కేసులలో పట్టుబడిన వాహనాలకు ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు శనివారం ఉదయం పదకొండు గంటలకు వేలం పాట నిర్వహించనున్నారు. ఆసక్తి గల వారు బహిరంగ వేలంపాటలో పాల్గొనాల్సిందిగా ప్రకటనలో పేర్కొ న్నారు. రూ.2,000 ధరావతు చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని సూచించారు.

పట్టుబడ్డ వాహనానికి వేలం

ప్రజాశక్తి - నకరికల్లు

నాటు సారా కేసులో పట్టుబడిన స్ప్లెండర్ ప్లస్ ద్విచక్ర వాహనానికి శుక్రవారం వేలంపాట నిర్వహించినట్లు ఎస్సై సురేష్ తెలిపారు. క్రైమ్ నెంబర్ 97/2021 పట్టుబడిన స్ప్లెండర్ వాహనాన్ని బహిరంగ వేలం లో బండారు బుచ్చమ్మ రూ.46,000 వేలకు పాట పాడినట్లు తెలిపారు.



మిర్చి నిల్వలు

		బ్యాగులు
మిర్చి దిగుమతి	:	38,437
మిర్చి ఎగుమతి	:	39,193
మిర్చి నిల్వ	:	14,604

మిర్చి ధరలు

	రూపాయలలో
334	10,000 - 27,000
నెం.5	10,000- 22,000
273	10,000 - 23,000
341	10,000 - 25,000
4884	14,700 - 21,500
సూపర్ 10	21,000 - 25,000
నాన్ ఎసి	
తేజ	9,500 - 26,500
బడిగి	10,000 - 26,800
దేవనూరు డీలక్స్	11,800- 26,000
తాలుకాయలు	4,000 - 14,000
ఎసి	
334	13,500 - 26,500
తేజ	11,500 - 21,000
బడిగి	26,000 - 26,200
తాలుకాయలు	4,000 - 11,000

రెండు పూరిళ్లు దగ్ధం

ప్రజాశక్తి-ఈపూరు

విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మండలంలోని కొండముట్ల పరిధిలోని దుష్మన్ పేట తండాలో రెండు పూరిళ్ల దగ్ధమైన సంఘటన శుక్రవారం జరిగింది.తండాకు చెందిన బాలాజీ నాయక్ రవి నాయక్ ల ఇల్లు మంటల్లో పూర్తిగా కాలిపోయాయి. బాలాజీ నాయక్ ఇంటిలో రూ. 70 వేల నగదు, రవి నాయక్ ఇంటిలో రూ. 20వేల నగదు తో పాటు ఇంట్లోనే సామాన్లు పూర్తిగా ఖాళీ బూడిదయ్యాయి. బాధితులు కట్టుబట్టలతో మిగిలారు.

డిఎ, పిఆర్‌సి బకాయిలు విడుదల చేయాలి

ప్రజాశక్తి- పెదనందిపాడు రూరల్

డి ఎ పి ఆర్ సి బకాయలు వెంటనే విడుదల చేయాలని ఏపీఎస్ జిఆర్ఇ .సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు సిహెచ్ఎ సుధాకర్ బాబు డిమాండ్ చేశారు. శుక్రవారం పెదనందిపాడు విశ్రాంత ఉద్యోగుల సంఘ కార్యాలయం లో ఏర్పాటు చేసిన మండల సర్వసభ్య సమావేశంలో వారు మాట్లాడారు. ప్రతినెల ఒకటవ తేదీనే పింఛనుదారులకు ప్రభుత్వం డబ్బులు వేయాలని లేకపోతే వారు అనేక కష్టాలు ఎదుర్కో వలసి వస్తుందన్నారు. విశ్రాంతఉద్యోగు లందరూ కృషి చేసి తమ సం ఘానికి నూతన కార్యాలయం నిర్మించుకోవడం ఆనందదాయకమన్నారు .

IN THE COURT OF THE HON'BLE PRINCIP DISTRICT JUDGE (MACT) AT PEDDAPALLY
MVO.P.NO. 27 OF 2022

Between:
Mohd Majid Hussain ..Petitioner
A N D
Thaneeru Malleshwari and others ..Respondents

To,
Thanneeru Malleshwari, W/o. Veeranjaneyulu, Age;34 years, H.No. 15-13-57/A1, Fourth Lane, RTC Colony, Near: Sai Baba Temple, Kothapeta, Guntur.

Take notice that the above named petitioner has filed a petition under **sec.166(1)(c) OF M.V. ACT** claiming compensation of **Rs. 3,00,000/-** on account of the injuries received by him. The said **OP** is posted on **23-01-2023** for your appearance.
if no appearance is made on your behalf on the above date the matter will be heard and decided in your absence.
Date : 04-03-2022

// BY ORDER OF THE COURT //
C. SATYANARAYANA REDDY,
Counsel for the Petitioners
A D V O C A T E
H.No.3-7-43, Seetharama Temple Street,
Peddapalli-505172.
email I.D. :
csnreddyadvocate@gmail.com
Cell:9849597113

టెండరు ప్రకటన

బాపట్ల జిల్లా టి సుండూరు(గ్రా),మరియు(మం), యందు గల శ్రీ కోదండరామ స్వామి దేవస్థానము నందు క్రింద తెలిపిన పనులకు గాను రిజిస్టరు కాంట్రాక్టర్ల నుండి సీల్డు టెండర్లు కోరబడుచున్నవి. సదరు పనులకు గాను టెండరుషెడ్యూల్సును ది.02-0-2023 నుండి ది.17-01-2023 సాయంత్రం గం॥ 4-00 లు వరకు మా కార్యాలయము నందు పొందవచ్చును.టెండరు ధరకాస్తుతో పాటు టెండరు ధరావత్తు డి.డి. గాని నగదు చెల్లించి రసీదును గాని జతపరచవలెను. పూర్తి చేసిన టెండర్లు ది. 17-01-2023 ఉదయం 12-00 లు వరకు స్వీకరించబడి అదే రోజు సాయంత్రం గం॥ 4-00లు కు సీల్డు టెండర్లును కార్యనిర్వహణాధికారి వారిచే తెరువబడును. పూర్తి వివరముల కొరకు దేవస్థానము కార్యాలయము పనిదినములలో సంప్రదించగలరు.

పనిపేరు	అంచనావిలువ	టెండరుధరావత్తు	టెండరుషెడ్యూలు ఖరీదు	పని పూర్తిచేయు కాలము
ముఖమండపం,అర్ధమండపం వెదరింగ్ కోర్స్,మరియు వాహన శాల నాప ఫ్లోరింగ్,	రూ.3,00,000/-	రూ.5000/-	రూ.500/-	1 నెల

ఇట్లు
కార్యనిర్వహణాధికారి



ఆశాజనకంగా వరి దిగుబడులు

ప్రజాశక్తి - ఈపూరు

మండలంలోని ఈపూరు, చిట్టాపురం, భద్రుపాలెం గ్రామాల్లో శుక్రవారం పంట కోత ప్రయోగం చేపట్టారు. బిపిటి-5204 ఎకరాకు 35 బస్తాలు, జేజిఎల్-384 రకం 38 బస్తాల దిగుబడి అంచనా వేసినట్లు మండల వ్యవసాయాధికారి ఆర్.రామారావు తెలిపారు. కూచినపల్లి గ్రామానికి చెందిన చెందిన రైతు కూకడాల రామదాసు జేజేలు సాగు చేయగా ఎకరాకు 42 బస్తాలు దిగుబడి వచ్చిందని, గతంకంటే వరి దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయని అన్నారు. ధాన్యానికి మద్దతు ధర క్వింటాళ్‌కు రూ.2040గా ప్రభుత్వం ప్రకటించిందని, 75 కిలోల బస్తాకు రూ.1600 లభిస్తుందని చెప్పారు. రైతులంతా తమ పంటను కొనుగోలు కేంద్రాల్లోనే అమ్ముకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎఇఒ బి.అప్పారావు, ఎస్‌బిఐ ఇన్సూరెన్స్ కో-ఆర్డినేటర్ సిహెచ్ శ్రీనివాసరావు, సచివాలయ అగ్రికల్చర్ వ్యవసాయ సహాయకులు ఎం.శేషు, సిహెచ్ తిరుమలరావు, ఎస్.కె.యు సల్మా, రైతులు పాల్గొన్నారు.



మూఢనమ్మకాలను విశ్వసించొద్దు

ప్రజాశక్తి - మాచర్ల

ప్రజలు మూఢనమ్మకాలను విశ్వసించవద్దని స్థానిక ప్రైవేటు, జూనియర్, డిగ్రీ కాలేజి ప్రిన్సిపాల్ వెంకటరామయ్య సూచించారు. కాలేజీ ఆవరణలో జన విజ్ఞాన వేదిక కేలండర్‌ను శుక్రవారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. శాస్త్ర విజ్ఞానం చాల అభివృద్ధి చెందుతోందని, ఇంకా మూఢ నమ్మకాల వైపు ప్రజలు చూడటం అవివేకమని అన్నారు. పల్నాడు ప్రాంతంలో చేతబడులు, దయ్యం పట్టటం లాంటి మూఢ నమ్మకాలు కోనసాగుతున్నాయని, వీటిపై ప్రజలంతా చైతన్యవంతులు కావాలని కోరారు. కార్యక్రమంలో జెవివి పల్నాడు జిల్లా గౌరవాధ్యక్షులు కేళం ఆదినారాయణ, ఉపాధ్యక్షులు జెవికెఎస్ ప్రసాద్, సుబ్బారావు పాల్గొన్నారు.

నకరికల్లు వాసికి విశాఖ ఫిల్మ్‌ఫెస్టివల్ అవార్డు

ప్రజాశక్తి - నకరికల్లు



ఇండియన్ ఫిలిం మేకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విశాఖపట్నంలోని విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన ఫిలిం ఫెస్టివల్‌లో నకరికల్లుకు చెందిన తిరువాయిపాటి రాఘవ తన షార్ట్ ఫిలిం 'ఓ చిట్టి ప్రేమ కథ'కుగాను ఇటీవల అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా దర్శకుడు, రచయిత రాఘవ మాట్లాడుతూ తాను చిత్రం తీయడానికి సహకరించిన నిర్మాతలు శివరామరాజు, పాండురంగారావుకు కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో పల్నాడు జిల్లాలో విజయలక్ష్మి క్రియేటివ్ వర్క్స్ బ్యానర్‌పై షార్ట్‌ఫిలిం ఫెస్టివల్ నిర్వహిస్తామని, పాల్గొనదలచినవారు 9160721506 ఫోన్ నంబర్‌కు సంప్రదించాలని కోరారు.

పేదల కోసం పాటుపడ్డ సాంబశివరావు

సంస్మరణ సభలో సిపిఎం గుంటూరు, పల్నాడు జిల్లాల కార్యదర్శులు పాశం రామారావు, గుంటూరు విజయ్‌కుమార్

ప్రజాశక్తి - యడ్లపాడు

పేదల పక్షాన కడవరకూ పోరాడటమే పారెళ్ల సాంబశివరావకు నివాళి అని సిపిఎం గుంటూరు, పల్నాడు జిల్లాల కార్యదర్శులు పాశం రామారావు, గుంటూరు విజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని లింగారావుపాలేనికి చెందిన సిపిఎం సభ్యులు పారెళ్ల సాంబశివరావు సంస్మరణ సభ గ్రామంలో శుక్రవారం నిర్వహించారు. సభకు సిపిఎం గ్రామ శాఖ కార్యదర్శి ఎ.సుబ్బారావు అధ్యక్షత వహించారు. రామారావు, విజయ్‌కుమార్ మాట్లాడుతూ జనన, మరణాలు ప్రకృతి సహజమని, అయితే సమాజం కోసం పాటుపడ్డవారు మరణానంతరమూ గుర్తుండి పోతారని చెప్పారు. అలాంటి వారిలో సాంబశివరావు ఒకరన్నారు. సిపిఎం సిద్ధాంతం, ఆశయాల సాధనకు సాంబశివరావు 42 ఏళ్లపాటు పాటుపడ్డారని, పార్టీ అభ్యున్నతికి నీతి, నిజాయితీతో కృషి చేశారని కొనియాడారు. గ్రామాభివృద్ధికి సిపిఎం చేసిన కృషిలో సాంబశివరావు పాత్రా ఉందన్నారు. ప్రజాసేవను ప్రజాసంస్కృతిగా తీర్చిదిద్దిన పుచ్చలపల్లి సుందరయ్య బాటలోనే సిపిఎం పని చేస్తుందన్నారు. సాంబశివరావును స్ఫూర్తిగా తీసుకుని వ్యవసాయ కార్మికులు, పేదల సమస్యలపై పని చేయాలన్నారు. కౌలురైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం



సంస్మరణ సభలో మాట్లాడుతున్న గుంటూరు విజయ్‌కుమార్

పల్నాడు జిల్లా కార్యదర్శి ఎ.లక్ష్మీశ్వరరెడ్డి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి వై.గోపాలరావు మాట్లాడుతూ పేద కుటుంబంలో జన్మించిన సాంబశివరావు ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటూ వ్యవసాయ కార్మికులు, పేదల కోసం పాటుపడ్డారని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై ఆర్థిక భారాలు మోపడంతోపాటు కుల, మత, ప్రాంతీయ తత్వాలను రెచ్చగొడుతున్నాయని, వీటన్నింటికీ వ్యతిరేకంగా ప్రజల్ని చైతన్యవంతం చేయడం ద్వారా సాంబశివరావకు నివాళులర్పించాలని అన్నారు. తొలుత సాంబశివరావు చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. సభలో నాయకులు కె.రోశయ్య, ఎన్.తాండవకృష్ణ, జి.హరిబాబు, టి.కోటేశ్వరరావు, ఎన్.భావన్నారాయణ పాల్గొన్నారు.



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

డివైఎఫ్ఐ కేలండర్ ఆవిష్కరణ

భారత ప్రజాతంత్ర యువజన సంఘం (డివైఎఫ్ఐ) పల్నాడు జిల్లా కేలండర్‌ను మండలంలోని లింగారావుపాలెంలో డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, సిపిఎం, ప్రజా సంఘాల నాయకులు శుక్రవారం ఆవిష్కరించారు. సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్ మాట్లాడుతూ యువతలో జాతీయ సమైఖ్యత, సేవాదృక్పథం, దేశాభివృద్ధి, సామాజిక చైతన్యం పెంచడానికి డివైఎఫ్ఐ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ప్రస్తుతం దేశంలో, రాష్ట్రంలో నెలకొన్న సమస్యలపై యువత కదలాలని, యువశక్తిని దేశాభివృద్ధికి ఎంతో కీలకమని చెప్పారు. కార్యక్రమంలో సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె.తులసి, ఆంజనేయరాజు, ప్రజాసంఘాల నాయకులు కె.రోశయ్య, ఎ.లక్ష్మీశ్వరరెడ్డి, వై.గోపాలరావు, వై.రాధాకృష్ణ, కె.నవిత పాల్గొన్నారు.

10 జిల్లాల్లో ఐఐటి ఫౌండేషన్ గురుకులాలు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

రాష్ట్రంలోని 10 జిల్లాల్లో ఐఐటి ఫౌండేషన్ గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేయనున్నట్లు ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి ఆర్.పావనమూర్తి తెలిపారు. మండలంలోని రామకృష్ణాపురంలో రూ.21 కోట్లతో నిర్మించిన బాలుర గురుకుల పాఠశాల భవనాన్ని పావనమూర్తి శుక్రవారం సందర్శించారు. తరగతి గదులు, డార్మెంటరీ, డైనింగ్‌హాల్‌ను పరిశీలించి కొన్ని మార్పులు చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిర్మాణ పనులు తుదిదశకు చేరుకున్నాయని, మార్చి నాటికి భవనాన్ని ప్రారంభిస్తామని చెప్పారు. రాష్ట్రంలో కడప జిల్లా బ్రహ్మంగారి మఠం, గుంటూరు జిల్లా వంకాయలపాడు, సత్తెనపల్లి, ప్రకాశం జిల్లా కురిచేడు, పశ్చిమగోదావరి జిల్లా ఆరుగొలనలో గురుకుల పాఠశాలలకు నూతన భవనాలు నిర్మిస్తున్నామని చెప్పారు. ఈ పనులన్నీ తుదిదశకు చేరుకున్నాయన్నారు. చిత్తూరు జిల్లా మెతుకువారిపల్లె, బాపట్ల నియోజకవర్గంలో నూతనంగా గురుకుల పాఠశాలలు ఏర్పాటు పరిశీలనలో ఉన్నట్లు తెలిపారు. పరిశీలనలో డిప్యూటీ కార్యదర్శి జి.యోగేశ్వరరావు, ఎఎంఒ ఎన్.సంజీవరావు, జిల్లా కో-ఆర్డినేటర్ శాంతి విశాల పాల్గొన్నారు.



రామకృష్ణాపురంలో గురుకుల భవనాన్ని పరిశీలిస్తున్న పావన మూర్తి

నేడు సిపిఎం పల్నాడు జిల్లా విస్తృత సమావేశం

హాజరుకానున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి - నరసరావుపేట

సిపిఎం పల్నాడు జిల్లా విస్తృత సమావేశం శనివారం నరసరావుపేట కొటప్పకొండ రోడ్డులోని ఆపార్టీ కార్యాలయంలో నిర్వహిస్తున్నామని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు హాజరవుతారని ఆహ్వానితులు, సభ్యులు, సానుభూతిపరులు సమావేశానికి హాజరు కావాలని ఆ ప్రకటనలో కోరారు.

హక్కులను హరించే జీవో 1ని రద్దు చేయాలి

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల తెచ్చిన జీవో 1ని రద్దు చేయాలని కోరుతూ పట్టణంలో సిపిఎం ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన చేపట్టారు. స్థానిక ఆంధ్రాబ్యాంక్ సెంటర్లో జీవో ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి టి.శ్రీనివాసరావు మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన భావ ప్రకటన స్వేచ్ఛను హరించే విధంగా జీవో ఉందని అన్నారు. దీన్ని రద్దు చేసే వరకూ ఉద్యమిస్తామని చెప్పారు. నాయకులు బి.నాగేశ్వరరావు, డి.వెంకటేశ్వర్లు, బి.వెంకటేశ్వర్లు, ఎస్.వెంకటకృష్ణ, జి.సత్యనారాయణ, షేక్ సైదా, నరసింహారావు, జి.శ్రీను పాల్గొన్నారు.

ప్రజాశక్తి-సత్తెనపల్లి

కొన్ని సంఘటనలు సాకుగా చూపి ప్రజల గొంతు నొక్కేందుకు రాష్ట్ర ప్రభుత్వం యత్నిస్తోందని సిఐటియు నాయకులు విమర్శించారు. జీవో 1ను రద్దు చేయాలని కోరుతూ ఆర్‌డిఓ కార్యాలయంలో సూపరింటెండెంట్ మస్తాన్‌కు వినతిపత్రం ఇచ్చారు. సిఐటియు పట్టణ కార్యదర్శి ఎం.హరిపోతురాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన జీవో ప్రతిపక్షాలను అణచడానికేనన్నారు. జీవో తెచ్చిన నాలుగు రోజుల్లోనే ఎన్టీఆర్ జిల్లా నందిగామలో అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు పెద్ద ఎత్తున ర్యాలీలు నిర్వహించారని గుర్తు చేశారు. ఇలాంటి జీవోలు ప్రజాస్వామ్యానికి విఘాతమన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సిఐటియు పట్టణ అధ్యక్షులు ఆర్.పురుషోత్తం, నాయకులు జె.రాజ్‌కుమార్, డేవిడ్‌రాజు, సాల్మన్‌రాజు, యోహాను పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మాచర్ల

రాష్ట్ర ప్రభుత్వం ఏకపక్షంగా తెచ్చిన జీవోను రద్దు చేయాలని వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ వై.రామచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపి వినతిపత్రం ఇచ్చారు. నాయకులు జివి సత్యనారాయణ, జి.పుల్లారెడ్డి, వి.నాగరాజు, కె.కోటేశ్వరరావు, జహిర్, ఆర్.ప్రతాప్‌బాబు, టి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



పిడుగురాళ్లలో సిపిఎం ఆధ్వర్యంలో జీవో ప్రతుల దహనం



సత్తెనపల్లిలో వినతిపత్రం ఇస్తున్న సిఐటియు నాయకులు



మాచర్లలో వినతిపత్రం ఇస్తున్న కాంగ్రెస్ నాయకులు

సాగుకు సాంకేతికతను జోడించండి

వ్యవసాయ యూనివర్సిటీ విసి విష్ణువర్ధన్‌రెడ్డి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రైతులకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని, అధునాతన సాగు పద్ధతులను, అధిక దిగుబడులు ఇచ్చే వంగడాల రూపకల్పనకు ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయము నిరంతరం కృషి చేస్తుందని వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఆదాల విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. బాపట్ల వ్యవసాయ కళాశాలలో రెండు రోజుల పాటు జరగనున్న 52వ పరిశోధన విస్తరణ సలహా మండలి తొలి రోజు ప్రారంభ సభలో ఆయన మాట్లాడుతూ విశ్వ విద్యాలయం డ్రోన్ టెక్నాలజీలో పేటెంట్ సాధించి వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థులకు శిక్షణ ఇస్తుందని తెలిపారు. విశ్వవిద్యాలయం రూపొందించిన వంగడాలు జాతీయ స్థాయిలో అత్యధిక శాతం వినియోగంలో ఉన్నాయన్నారు. ప్రభుత్వ మార్కెటింగ్ శాఖ ప్రత్యేక సలహాదారు బత్తుల బ్రహ్మానంద రెడ్డి మాట్లాడుతూ బాపట్ల వ్యవసాయ కళాశాల రూపొందించిన బి.పి.టి. 5204 దేశంలోనే అత్యుత్తమమైన వరి వంగడంగా ప్రాచుర్యం పొందిందని తెలిపారు. రైతులు ఒకే పంటను వెయ్యకుండా పంటల వైవిధ్యం మరియు పంటల మార్పిడి చేసుకున్నట్లైతే దిగుబడులు పెరుగుతాయని, భూసార పరీక్షలు చేయించుకుని వాటి ఫలితాలను బట్టి ఎరువులు వాడుకోవాలని సూచించారు. రైతులు గ్రామ స్థాయిలోనే వారి సమస్యలను నివత్తి చేసుకునేందుకు ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసిందని, శాస్త్ర పరిజ్ఞానం రైతుల వ్యవసాయ క్షేత్రాల వరకు చేరుకోవాలన్నారు. పూర్వ ఉప కులపతి డాక్టర్ పి.రాఘవ రెడ్డి మాట్లాడుతూ వాతావరణ పరిస్థితులను అనుసరించి పంటల సాగును చేపట్టాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు ఐ. తిరుమల రెడ్డి మాట్లాడుతూ రైతులు రసాయనిక ఎరువులను వాడకుండా సేంద్రియ వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని సూచించారు. పంట మార్పిడిని, చిరు ధాన్యాల సాగు చేపట్టి ఆరోగ్యవంతమైన దిగుబడిని సాధించాలన్నారు.



వ్యవసాయ విశ్వ విద్యాలయం 2021 - 22 సంవత్సరంలో జరిపిన పరిశోధన మరియు విస్తరణ ఫలితాలు మరియు కార్యాచరణ ప్రణాళికలను డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర ఎల్.ప్రశాంతి, డైరెక్టర్ ఆఫ్ ఎక్స్టెన్షన్ డా.పి.రాంబాబు వివరించారు. వివిధ పంటలలో సేంద్రియ సాగు విధానాలుపై శాస్త్రవేత్తలు రూపొందించిన సాంకేతిక పద్ధతులను ముద్రించి పుస్తక రూపంలో ఆవిష్కరించారు. ఉత్తమ వ్యవసాయ పరిశోధనా స్థానంగా విజయనగరం, ఉత్తమ ప్రాంతీయ పరిశోధనా స్థానంగా తిరుపతి, ఉత్తమ కృషి విజ్ఞాన కేంద్రంగా దర్శి, ఉత్తమ ఏరువాక కేంద్రంగా విజయనగరం, చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానానికి అగ్రి టూరిజం ప్రోత్సాహక అవార్డు, ఉత్తమ శాస్త్రవేత్తలుగా డా.సాంబయ్య మరియు డా. నాగార్జున రెడ్డిలకు ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో అసోసియేట్ డీన్ డాక్టర్ వి.శ్రీనివాస రావు, రిజిస్ట్రార్ డాక్టర్ జి. రామారావు, అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ జి. సుబ్బారావు పాల్గొన్నారు.

నెహ్రూ నికేతన్‌లో సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి-తెనాలి



సంప్రదాయ వేషధారణలో చిన్నారులు

స్థానిక బోస్‌రోడ్డులోని నెహ్రూ నికేతన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో శుక్రవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. పండుగ వాతావరణాన్ని కనిపించేలా విద్యార్థులు గొబ్బెమ్మలు, రంగవల్లులు, హరిదాసు వేషాలు, సంప్రదాయ దుస్తులలో అలరించారు. విద్యార్థుల కోలాటం ప్రదర్శన, సంప్రదాయ నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మేనేజింగ్ డైరెక్టర్ మురళీకాంత్ దాసరి ఈ సందర్భంగా మాట్లాడుతూ మతసామరస్యాన్ని పెంపొందిస్తూ, విద్యార్థులకు పండుగలు వాటి విశిష్టతను తెలియజెప్పేందుకు కార్యక్రమం నిర్వహించామన్నారు. చిన్నారులకు బోగిపళ్ళు పోశారు. కార్యక్రమాన్ని ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గీతాకాంత్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



పేదల పక్షపాతి ప్రజాశక్తి

కేలండర్ ఆవిష్కరణలో ఎమ్మెల్యే మేకతోటి సుచరిత

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

ప్రజాశక్తి నూతన సంవత్సర క్యాలెండర్ ప్రత్తిపాడు నియోజకవర్గ శాసనసభ్యురాలు మాజీ మంత్రి మేకతోటి సుచరిత శుక్రవారం గుంటూరులోని ఆమె కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు కార్మిక, కర్షక, బడుగు, బలహీన వర్గాల పత్రిక అని తెలిపారు. ప్రజాశక్తి కేలండర్ ఆవిష్కరించడం తనకు ఎంతో సంతోషదాయకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రజాశక్తి జిల్లా, సిటి ఇంచార్జ్ చుక్క శంకర్రావు, కానాల సుధీర్, శ్రీహరి, హనీఫ్, పవన్ పాల్గొన్నారు.

రెండోరోజు కొనసాగిన ఎడ్ల బల ప్రదర్శన

ప్రజాశక్తి - కొల్లిపర

డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి అన్నా బత్తుని సత్యనారాయణ గుది బండి వెంకటరెడ్డి జ్ఞాపకం కొల్లిపరలో కొనసాగుతున్న జాతీయస్థాయి ఒంగోలు జాతిఎద్దుల బల ప్రదర్శన శుక్రవారం రెండో రోజున న్యూ కేటగిరి విభాగంలో 17 జతలు పోటీపడ్డాయి. 17 జతలలో మొదటి స్థానంలో నిలిచిన ఎద్దుల జతలకు రూ 3 లక్షల 30,000 విలువగల బహుమతులు అందజేయనున్నారు. కార్యక్రమంలో తెనాలి శాసనసభ్యులు అన్నాబత్తుని శివకుమార్, హ్యూమన్ రైట్స్ కమీషన్ జడ్జి శ్రీనివాస్ , పోటీ నిర్వాహకులు ఈమని హరి కోటి రెడ్డి, చంచల రామిరెడ్డి, అల్లం బాపిరెడ్డి ,వైయస్ఆర్సీపీ నాయకులు ఆరిగ చంద్రారెడ్డి ,ఉయ్యూరు ఉమామహేశ్వర్ రెడ్డి, నిర్ల కుటుంబ రెడ్డి, అవుతు పోతిరెడ్డి వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్న ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షలు కేటాయించాలి

నేటి నుండి జగనన్న కాలనీల్లో సర్వే

సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు

ప్రజాశక్తి-తాడేపల్లి


మాట్లాడుతున్న సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు

జగనన్న ఇంటి నిర్మాణాలకు రూ. 5లక్షలు కేటాయించాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం సాయంత్రం పల్లె కృష్ణ అధ్యక్షతన సిపిఎం రూరల్ కమిటీ సమావేశం స్థానికి మేకా అమరారెడ్డి భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ నేటి నుండి 13వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా జగనన్న కాలనీల్లో సర్వేతో పాటు సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతున్న తీరుపై సిపిఎం సర్వే నిర్వహిస్తుందని చెప్పారు. అందులో భాగంగానే గుంటూరు జిల్లాలో కూడా అన్ని మండలాలు గ్రామాల్లో సర్వే నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. గుంటూరు జిల్లాలో 67,485 మందికి జగనన్న ఇంటి పట్టాలు ఇచ్చారని, అందులో శ్లాబ్ పూర్తయినవి 2,119 ఉన్నాయని తమ సర్వేలో తేలిందని చెప్పారు. పునాది దశలో 14,729 ఇళ్లు ఉన్నాయని చెప్పారు. ఈ లెక్కన చూస్తే వేల సంఖ్యలో ఇళ్లస్థలాలు ఇచ్చిన ప్రభుత్వం ఇళ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంలోగానీ, స్థలాలు ఇచ్చిన లేఅవుట్లలో మౌలిక సదుపయాలు కల్పిండచంలోగానీ శ్రద్ధ పెట్టలేదని తెలుస్తుందన్నారు. ఈ విధంగా చూస్తే జనగన్న ఇళ్లు ఇప్పట్లో పూర్తయ్యే పరిస్థితి కానరావడంలేదని చెప్పారు. జగన్న ఇళ్లు నిర్మాణం పూర్తి కాకపోవడానికి ప్రభుత్వం ఇస్తున్న రూ.1.80 లక్షలు సరిపోవడంలేదని తెలిపారు. కనీసం ఇంటి పునాదులకు కూడా ప్రభుత్వం ఇచ్చే డబ్బు చాలడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి ఈ విషయాలన్నీ తెలిసినా ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయడంపై తగిన శ్రద్ధ చూపడంలేదని విమర్శించారు. ఇంటి నిర్మాణానికి అవసరమైన ఇనుము, ఇసుక, సిమెంటు ధరలు ఇబ్బడిముబ్బడిగా పెరగడమే ఓ కారణమన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కనీసం రూ.5 లక్షలు కేటాయించాలని డిమాండ్ చేశారు. అలాగే లేఅవుట్లు వేసిన స్థలాల్లో మంచినీరు, రోడ్లు, విద్యుత్, బస్సులు వంటి కనీస సదుపాయాలు కల్పించలేదని చెప్పారు. టిడ్కో గృహాల పరిస్థితి కూడా ఇలానే ఉందన్నారు. పూర్తయిన టిడ్కో గృహాలను లబ్ధిదారులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే నిర్మాణం అయిన గృహాల్లో లబ్ధిదారులు లేకపోవంతో పాడైపోతున్నాయన్నారు. టిడ్కో ఇంటి కోసం గతంలో లక్షల రూపాయలు చెల్లించిన లబ్ధిదారులు అటు డబ్బు పోయి ఇటు ఇల్లు రాక రెండింటికీ చెడ్డ కావడిలా తయ్యారయ్యారని అసంతృప్తి వ్యక్తం చేశారు. పక్కనే ఉన్న రాజధానిలో ఐదు వేల టిడ్కో ఇళ్లు నిర్మాణం పూర్తయినా లబ్ధిదారులకు ఇవ్వడంలేదని చెప్పారు. వెంటనే అర్హులైన వారికి ఆ ఇళ్లను ఇచ్చి గృహ ప్రవేశాలు చేయించాలని డిమండ్ చస్త్రశారు. రాజధానికి ఆనుకుని ఉన్న తాడేపల్లి ప్రాంతంలో ఒక టిడ్కో ఇల్లు కూడా లేకపోవడం ఆందోళన కలిగిస్తుందన్నారు. తాడేపల్లి పట్టణంలో గతంలో జగనన్న ఇంటి పేరుతో ఇచ్చిన తెల్లకాగితాల స్థానంలో స్థలాలు చూపించి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే జిల్లాలో పది వేల మందికి సంక్షేమ పథకాలు కోత కోస్తున్నట్లు అధికారులు లబ్ధిదారులకు నోటీసులు ఇచ్చారని చెప్పారు. తాడేపల్లి పట్టణంలో 500 మందికి ఇదే విధమైన నోటీసులు అధికారులు అందజేసిన సంగతిని గుర్తు చేశారు. 300 యూనిట్లు విద్యుత్ వాడకం, ఇల్లు, నాలుగు చక్రాల వాహనం వంటి నిబంధనలతో రేషన్ కార్డులు, సామాజిక పింఛన్లు తొలగించడం సరికాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీరు కుడి చేత్తో ఇచ్చి ఎడమ చేత్తో లాక్కున్నట్లు ఉందని చెప్పారు. వీటన్నంటిపై ఈ నెల 7వ తేదీ నుంచి 13వ తేదీ వరకు సర్వే చేసి బాధితులను సమీకరించి సచివాలయాల వద్ద ఆందోళన నిర్వహిస్తామని చెప్పారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఇచ్చిన మాటలకు కట్టుబడి జగనన్న ఇళ్లు, టిడ్కో ళ్లు, సంక్షేమ పథకాలు లబ్ధిదారులందరికీ సక్రమంగా అందేలా చూడాలని డిమాండ్ చేశారు. సిపిఎం రూరల్ కార్యదర్శి దొంతిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ చిర్రావూరు గ్రామంలో పశువుల ఆసుపత్రిలో అన్ని రకాల వసతులు కల్పించాలని, వైద్యున్ని నిమమించాలని, శ్మశానవాటిక ఏర్పాటు చేయాలని, డ్రెయినేజీ సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఎం సీనియర్ నాయకులు జొన్నా శివశంకరరావు, సిపిఎం రూరల్ మండల కార్యదర్శి డి వెంకటరెడ్డి, నాయకులు కాజ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

లూయి బ్రెయిలీకి నివాళులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



మాట్లాడుతున్న లక్ష్మణరెడ్డి

నేత్రదానం చేసి అంధత్వాన్ని నిరోధించాలని జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం అంధుల లిపి బ్రహ్మ లూయి బ్రెయిలీ 171 వ వర్ధంతిని ఘనంగా శ్రీ షిర్డీ సాయి ధీన జన సేవా సమితి ఆధ్వర్యంలో గుంటూరులో అంధుల, వికలాంగుల పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ పారిస్ సమీపంలో జన్మించిన లూయి బ్రెయిలీ తాను రూపొందించిన అంధుల లిపి ద్వారా ప్రపంచవ్యాప్తంగా కోట్లాదిమంది అంధులలో విజ్ఞానాన్ని అందించారన్నారు. అంధత్వాన్ని, వైకల్యాలను అధిగమించి జాన్ మిల్టన్,ఫ్రాంక్లిన్ రూజు వెల్ట్,లాక్కోజు భుజంగ రాయ శర్మ, ద్వారం వెంకటస్వామి,స్టీఫెన్ హాకింగ్,మహమ్మద్ అలీ లాంటి ఎంతోమంది విభిన్న రంగాలలో ప్రతిభావంతులైనారన్నారు. వికలాంగుల కార్పొరేషన్ చైర్ పర్సన్ కుమారి ముంతాజ్ పఠాన్ ప్రసంగిస్తూ ప్రభుత్వం విభిన్న ప్రతిభావంతులకు విద్య,ఉద్యోగాలలో నాలుగు శాతం రిజర్వేషన్ కల్పించిందన్నారు. కార్యక్రమంలో గనిక ఝాన్సీ,శ్రీ షిర్డీ సాయి దిన జన సేవా సమితి అధ్యక్షులు అన్నంగి పూర్ణచంద్రరావు,కార్యదర్శి పన్నాల సత్యనారాయణ మూర్తి, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ ఎన్.సూర్య భగవాన్,ఆర్.శివరామ సుబ్రహ్మణ్యం లు ప్రసంగించారు.

ఏప్రిల్ 5న రవాణా కార్మికుల చలో ఢిల్లీ

ప్రజాశక్తి-గుంటూరు

రవాణా రంగ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏప్రిల్ 5న ఛల్లో డిల్లీ కార్యక్రమంలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆటో డ్రైవర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నన్నపనేని శివాజీ పిలుపునిచ్చారు. శుక్రవారం యూనియన్ జిల్లా సమావేశం, జిల్లా అధ్యక్షులు బి.లక్ష్మణరావు అధ్యక్షతన పాతగుంటూరులోని సిఐటియు కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా శివాజీ మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రవాణా రంగంపై తీవ్రమైన భారాల మోపుతుందన్నారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు మోడీ హయాంలో 38 సార్లు పెంచారన్నారు. మోటార్ వెహికల్ చట్ట సవరణ చేసి డ్రైవర్లపై తీవ్రమైనటు భారాలు మోపారన్నారు. సమస్యలు పరిష్కారం కోసం ఏప్రిల్ 5న జరిగే చలో ఢిల్లీ కార్యక్రమంలో రవాణా రంగ కార్మికుల పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా గౌరవ అధ్యక్షులు షేక్ మస్తాన్ వలి, కోశాధికారి గండికోట శంకర్, మరియదాసు, అమీర్ భాష, కొండలు ఏడుకొండలు, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న శివాజీ

రైతులకు నష్టపరిహారమివ్వకుంటే ఆందోళన

రైతు సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి గోపాలరావు డిమాండ్

ప్రజాశక్తి - అచ్చంపేట

మండలంలోని తాళ్లచెరువులో నకిలీ పత్తి విత్తనాలు వేసి నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వకపోతే ఆందోళన తప్పదని పల్నాడు జిల్లా రైతు సంఘ కార్యదర్శి ఏపూరి గోపాలరావు హెచ్చరించారు. శుక్రవారం రాత్రి తాళ్ళ చెరువులో రైతులతో సమావేశమయ్యారు ఈ సందర్భంగా నకిలీ విత్తనాలు వేసి నష్టపోయిన ప్రత్తి రైతులు తమ ఆవేదనను రైతు సంఘ నాయకుల ముందు వ్యక్తం చేశారు. గ్రామంలో 600 ఎకరాలలో 200 మంది రైతులు గంగా కావేరి రకానికి చెం దిన సిక్సర్ పత్తి విత్తనాలను సాగుచేయ డంతో 3 కోట్ల రూపాయల నష్టం వాటిల్లిన విషయాన్ని వ్యవసాయ శాఖాధికారులు ,లామ్ శాస్త్రవేత్తలు, స్థానిక ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లిన సమస్య పరిష్కారం కాలేదన్నారు. రైతు సంఘం నాయకులు తమ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి ఆదుకోవాలని వారు కోరారు ఈ సందర్భంగా గోపాలరావు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా నకిలీ విత్తనాలతో రైతులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని అన్నారు. రైతు ప్రభుత్వం అని చెప్పుకుంటున్న ప్రభుత్వం, నకిలీలను అరికట్టడంలో విఫలమైందని విమర్శించారు. రైతులు సంఘాల ఆందోళనతో నల్ల చట్టాలు వెనుకకు వెళ్లాయని అన్నారు.


తాళ్ళ చెరువులో రైతులతో సమావేశంలో మాట్లాడుతున్న ఏపూరి గోపాలరావు

రైతు పోరాటాల ద్వారానే న్యాయం జరుగుతుందని చెప్పారు. జిల్లా వ్యవసాయ శాఖాధికారులు, రాష్ట్ర వ్యవసాయ కమిషనర్‌కు తెలియపరచి నకిలీ విత్తనాల కంపెనీలపై చర్యలు తీసుకునేలా పోరాడి నష్టపరిహారం ఇప్పిచ్చేంత వరకు రైతు సంఘ నాయకులు వెంట ఉంటా రంటూ వారికి భరోసా కల్పించారు. గ్రామం లో రైతులు కమిటీగా ఏర్పడాలని సూచిం చారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తున్న రైతు సంఘాలు, ప్రజా సంఘాలు అన్నీ కూడా రైతు పక్షానే ఉన్నాయన్నారు. రైతు సంఘం నాయకులు మర్రెడ్డి మాట్లాడుతూ తాళ్ళచెరువులో ప్రధాన జీవనాధారం వ్యవసాయం అని, ఒక గ్రామంలోనే మూడు కోట్ల రూపాయలకు పైగా నష్టం వాటిల్లిన ఫలితంగా కూలీలకు పనులు లేక రైతులు ఆర్థికంగా ఇబ్బంది పడి వ్యవసాయం కుంటుపడుతుందన్నారు. రైతులు సంఘటితంగా పోరాడితే ఇటువంటి నకిలీ కంపెనీల ఆట కట్టించవచ్చన్నారు. సమావేశంలో మండల రైతు సంఘం నాయకులు రావెల వెంకటేశ్వర్లు, తాళ్ళచెరువు రైతులు నల్లగొండ కోటేశ్వరరావు, కె. శ్రీను, చింతపల్లి శ్రీనివాసరావు, సంపంగి సురేష్,గాదె ఎన్నరెడ్డి, తుమ్మ బాలస్వామి, పూతల గురవయ్య పాల్గొన్నారు.



నైట్‌వాచ్ మెన్ డ్యూటీలు వద్దు

ప్రజాశక్తి- పిడుగురాళ్ల

పిడుగురాళ్ల మండల గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం సమావేశం మండల అధ్యక్షులు అంజి, సెక్రటరీ వంశీ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశానికి పల్నాడు జిల్లా అధ్యక్షులు షేక్ బందగీ సాహెబ్ ,గురజాల డివిజన్ అధ్యక్షులు రాజు, గురజాల డివిజన్ సంఘం గౌరవ అధ్యక్షులు శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సమావేశానికి పిడుగురాళ్ల మండలంలో ఉన్న గ్రామ రెవెన్యూ సహాయకులు అందరూ పాల్గొన్నారు. జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ నైట్ వాచ్ మెన్ డ్యూటీలను వెంటనే తొలగిం చాలని, భవిష్యత్తులో మన సమస్యల కొరకు పోరాటాలకు సిద్ధంగా ఉండాలని, సంఘంలో ప్రతి ఒక్క వీఆర్ఏ ఐక మత్యంతో కలిసి ఉండాలని పిలుపునివ్వడం జరిగింది. సంఘం గౌరవ అధ్యక్షులు శ్రీనివాసరావు మాట్లాడారు.అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు.


జలవనరుల శాఖ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న చిత్రం

కుడికాల్వ పరిధిలోని ఖాళీ పోస్టులు భర్తీ చేయాలి

ప్రజాశక్తి- సత్తెనపల్లి రూరల్

పిడబ్ల్యుడి వర్క్ షాప్స్ అండ్ కెనాల్స్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఆధ్వర్యంలో నాగార్జునసాగర్ కుడికాలువ పనులు చేస్తున్న మెయింటెనెన్స్ సిబ్బంది సమస్యలపై రాష్ట్ర సచివాలయంలోని ప్రిన్సిపల్ జలవనుల శాఖ సెక్రెటరిని, ప్రభుత్వ ఉద్యోగుల సం క్షేమ సలహాదారుడు ఎన్. చంద్రశేఖర్ రెడ్డి, ఎపిఎన్‌జిఒ రాష్ట్ర అధ్యక్షులు బండి శ్రీనివాసరావులను శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పిడబ్ల్యుడి వర్క్ షాప్, అండ్ కెనాల్స్ వర్కర్స్ యూనియన్ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి ఉప్పలపాటి రంగయ్య మాట్లాడుతూ నాగార్జునసాగర్ కుడకాల్వ పరిధిలో ఖాళీగా ఉన్న 1100 పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ముఖ హాజరు నుండి ఫీల్డ్ స్టాఫ్ కు మినహాయింపు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. 2018 పెండింగ్‌లో ఉన్న బిల్లులు అన్నింటిని చెల్లించాలని, లింగంగుంట్ల సర్కిల్ పరిధిలో మెయింటెనెన్స్ సిబ్బందికి గత నాలుగేళ్లుగా నిలిచిపోయిన సైకిల్ అలవెన్స్ ఇవ్వాలని కోరారు. పిడబ్ల్యుడి వర్క్ షాప్ అండ్ కెనాల్ వర్కర్స్ యూనియన్ కేంద్ర కమిటీ అధ్యక్షులు. టి.శేషయ్య, కార్యదర్శి కంబాల శ్రీనివాసరావు,రాష్ట్ర ఎన్జీవో నాయకులు శివారెడ్డి ఉన్నారు.

మానవ అక్రమ రవాణాపై అప్రమత్తంగా ఉండండి

ప్రజాశక్తి- పిడుగురాళ్ల

మానవ అక్రమ రవాణా,పోక్సో చట్టం,బాల కార్మిక వ్యవస్థ,బాల్యవివాహాలు మొదలగు అంశాలపై పిడుగురాళ్ల రైల్వేస్టేషన్‌లో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం ,రైల్వే పోలీస్ సమన్వయంతో నిర్వహించిన ఈ సదస్సులో వక్తలు మాట్లాడుతూ మానవ అక్రమ రవాణాపై ప్రతి ఒక్కరు చైతన్యం కలిగివుండాలన్నారు. .వివిధ ప్రాంతాలకు వెళ్లే సమయంలో అపరిచిత వ్యక్తులమాటలు నమ్మవద్దు,వారు ఇచ్చిన తినుబండారులను తినవద్దని సూచించారు. సామాజిక మాధ్యమాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, .ముక్కు ముఖం తెలియనివారిని పరిచయాల ముసుగులో పడి మోస పోకుండా జాగ్రత్త వహించాలన్నారు.

అనారోగ్యంతో మృతి చెందిన మున్సిపల్ కార్మికుడికి నివాళి

ప్రజాశక్తి-నరసరావుపేట

అనారోగ్యంతో కాంట్రాక్ట్ విధానంలో పని చేస్తున్న మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుడు జయపు మస్తాన్‌రావు (35) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. ఈవిషయం తెలుసుకున్న సిఐటియు పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు గుంటూరు విజయ్ కుమార్, మస్తాన్ రావు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మృతుడి కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు.

ఈ సందర్భంగా విజయ్ కుమార్ మాట్లాడుతూ మస్తాన్‌రావు కుటుంబంలో ఒకరికి కాంట్రాక్టు విధానంలో పని చేసే అవకాశం కల్పించాలని కోరారు. మస్తాన్‌రావు మృతి విషయం తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ డి.రవీంద్ర నివాళులర్పించారు. మట్టి ఖర్చులు కింద రూ.15 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. కాంట్రాక్టు విధానంలో ఒకరికి పనిచేసే అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారు. సిఐటియు


నివాళులర్పిస్తున్న గుంటూరు విజయ్‌కుమార్

మండల అధ్యక్షుడు సిలార్ మసూద్ మాట్లాడుతూ మస్తాన్ రావుకు రావలసిన పి.ఎఫ్, ఇతర బకాయిలను మంజూరు చేయించాలని కమిషనర్‌ను కోరారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. నివాళులర్పించిన వారిలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి మల్లీశ్వరి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు అమరారపు సల్మాన్, పి మల్లయ్య, డి యోహన్, పిట్టా ఏసు,వీంకుమార్ ఉన్నారు.

ప్రత్తిపాడు మాజీ ఎమ్మెల్యే చుక్క పీటర్‌పాల్ మృతి

ప్రజాశక్తి-సత్తెనపల్లి

సత్తెనపల్లి కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి చుక్క చంద్రపాల్‌కు పితృ వియోగం కలిగింది. చంద్ర పాల్ తండ్రి, ప్రత్తిపాడు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే చుక్క పీటర్ పాల్ శుక్రవారం మరణించారు. ఆయన మృతిపై సత్తెనపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. గుంటూరులోని స్వగృహంలో చుక్క పీటర్ పాల్ పార్థివ దేహాన్ని వారు సందర్శించి, పూలమాలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. నివాళుర్పించిన వారిలో జ్ఞాన్ రాజ్ పాల్, జానీ ఖాజావలి, రామకృష్ణ మూర్తి, జెట్టి శేఖర్, కొత్త లక్ష్మయ్య, అలీఖాన్, సిద్దల మోహనరావు, కోటపాటి సాంబశివ రావు,మంగళపురి శంకర్,రావెల విజయ్ కుమార్, గుజ్జర్లపూడి కన్నా, మాబు సుభాని ఉన్నారు.


మాజీ ఎమ్మెల్యే చుక్క పీటర్‌పాల్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు

వైసిపి సీనియర్ నాయకుడు శ్రీనివాసరావు మృతి

ప్రజాశక్తి - అచ్చంపేట: మండలంలోని కోనూరులో వైసిపి సీనియర్ నాయకుడు పసుపులేటి శ్రీనివాసరావు శుక్రవారం తెల్లవారు జామున గుండెపోటుతో మృతి చెందారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఆయన మృత దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు. వైసిపి ఆవిర్భావం నుంచి పార్టీలో ఉంటూ ఎనలేని సేవ చేసిన శ్రీనివాసరావు మృతి పార్టీకి, తనకు వ్యక్తిగతంగా తీరని లోటని ఎమ్మెల్యే అన్నారు. శ్రీనివాసరావు కుటుంబానికి వైసిపి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

సామాజిక పింఛనుతో ఆత్మస్థైర్యం : మంత్రి అంబటి

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

ప్రభుత్వం ప్రతి నెలా ఠంచనుగా అం దిస్తున్న సామాజిక పింఛన్ వృద్ధులకు, వికలాంగులకు, ఒంటరి మహిళలకు ఆత్మస్థైర్యాన్ని కల్పిస్తోందని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. సత్తెనపల్లి మండల పరిషత్ కార్యాలయంలో పింఛన్ వారోత్సవాల సందర్భంగా నూతనంగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు శుక్రవారం అందజేశారు.ఎన్నికలకు వెళ్లే ముందు మిగిలిన రూ.250 కూడా పెంచి మొత్తం రూ.3 వేలు అందిస్తామన్నారు.

పింఛన్లపై టిడిపి గోబెల్స్ ప్రచారం

ప్రజాశక్తి-ఈపూరు

పార్టీలకతీతంగా పారదర్శకంగా పింఛన్లు అందజేస్తున్న ప్రభుత్వంపై వాటి ని తొలగించారంటూ టిడిపి గోబల్స్ ప్రచా రం చేస్తోందని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మ నాయుడు అన్నారు. స్థానిక మండల పరి షత్ కార్యాలయం వద్ద శుక్రవారం పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లా డుతూ ఆర్థికపరమైన అంశాలతో పింఛన్లు రద్దయిన వారు అనర్హులుగా భావించా లన్నారు. నందమూరి తారక రామారావు, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రజా నాయకులను చంద్రబాబువి అడ్డదారి రాజకీయాలని విమర్శించారు. నియోజకవర్గ పరిధిలో 17,250 ఎకరాల అగ్రహారం భూముల శాశ్వత హక్కుల కోసం శాసనసభలో ప్రస్తావించానని, భూ రీ సర్వే ద్వారా ఆయా గ్రామాల రైతుల కల సాకారం కానుందన్నారు. అనంతరం లబ్ధి దారులకు పింఛన్లు పంపిణీ చేశారు.

'క్షేత్రస్థాయికి వస్తే అభివృద్ధి చూపిస్తా'

ప్రజాశక్తి - బెల్లంకొండ

వైసిపి పాలనలో పెదకూరపాడు నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిపై విమర్శలు చేసేవారు క్షేత్రస్థాయికి వస్తే తాను చేసిన అభివృద్ధిని చూపిస్తానని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద నూతనంగా మంజూరైన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మండలంలో నూతనంగా మంజూ రైన 134 మందికి పింఛన్లు అంద జేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సోషల్ మీడి యాలో తనపై విమర్శలు చేస్తున్న వారు క్షేత్ర స్థాయి లోకి వచ్చి నిజా నిజాలు పరిశీలించాలని సూచించారు. తానే దగ్గరుండి చేసిన అభివృద్ధి చూపిస్తానన్నారు.

ప్రజాశక్తి -పెదకూరపాడు నూతనంగా మంజూరైన పెన్షన్లను ఎమ్మెల్యే శంకరారావు పంపిణీ చేశారు. మండలంలో 319 పెన్షన్లను మంజూరు చేయడం జరిగింది.

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి-నరసరావుపేట

కుల,మత, పార్టీలకు అతీతంగా అర్హులైన లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం పింఛన్లు మంజూరు చేస్తుందని లింగంగుంట్ల మాజీ సర్పంచ్ పొన్నపాటి విజయ కృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం వైఎస్సార్ పింఛన్ వారోత్సవాలలో భాగంగా మండలంలోని లింగంగుంట్ల పంచాయతి పరిధిలోని సచివాలయం- 2 లో పింఛన్ల పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న పొన్నపాటి మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు, అధికారం చేపట్టిన నాల్గో ఏడాది రాగానే రూ. 2,750 పింఛన్ అంద జేయడం జరిగిందన్నారు. వాలంటీర్ల ద్వారా 1 వ తేదీన నేరుగా లబ్ధిదారుని ఇంటికే పంపిణీ చేస్తున్న ఘనత వైసిపికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో పంచాయతి కార్యదర్శి కెవి శివప్రసాద్,పొన్నపాటి పాపిరెడ్డి, ఏరువ పాల వెంకటరెడ్డి, మాజీ ఎంపిటిసి ధూపాటి శ్రీనివాసరావు, సచివాల సిబ్బంది శ్రీలక్ష్మి, విజయలక్ష్మి, వాలంటీర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.




లబ్ధిదారులకు పెన్షన్ పంపిణీ చేస్తున్న మాజీ సర్పంచ్ పొన్నపాటి

ప్రజాశక్తి 7
గుంటూరు జిల్లా
శనివారం 7 జనవరి 2023

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

నగర కమిషనర్ కీర్తి చేకూరి

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరంలో టెండర్ ప్రక్రియ పూర్తి అయిన అభివృద్ధి పనులు ప్రారంభించి, వేగవంతం చేసేలా పర్యవేక్షించాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు.టెండర్ పొంది పనులు ప్రారంభించని కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని ఎస్.ఈకి సూచించారు. శుక్రవారం కమిషనర్ జిఎంసి సమావేశ మందిరంలో అభివృద్ధి పనులు, నాడు-నేడు, హౌసింగ్, తాగునీటి సరఫరా తదితర అంశాలపై నగరపాలక సంస్థ ఇంజినీరింగ్, హౌసింగ్, విద్యుత్ శాఖ అధికారులతో, ఎమినిటీ కార్యదర్శులతో సమీక్షించారు. ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా అనేక అభివృద్ధి పనులు మంజూరు చేస్తున్నామని, అటువంటి పనుల్లో రాజీపడకుండా, వేగంగా, నాణ్యతా ప్రమాణాలు తగ్గకుండా పర్యవేక్షించాలన్నారు.గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రజాప్రతినిధులు ఆయా ప్రాంతాల్లో గుర్తించిన పనులకు కూడా వెంటనే టెండర్స్ పిలవాలన్నారు. నిర్మాణ దశలో ఉన్న వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాలను త్వరగా పూర్తి చేయాలన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా నగరంలోని అన్ని ప్రజా మరుగుదొడ్లకు మరమ్మతులు చేయాలని, సులభ్ ఆధ్వర్యంలోని మరుగుదొడ్లు కూడా శుభ్రంగా ఉండేలా చూసుకోవాలని నోటీసులు ఇవ్వాలన్నారు. గాంధీ పార్క్ పనులు జనవరి నెలాఖరుకి పూర్తి చేయాలని, ప్రధాన జంక్షన్లను, ట్రాఫిక్ ఐలాండ్స్‌ను అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకోవాలని ఏ.డి.హెచ్.ని ఆదేశించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇంజినీరింగ్ విభాగ అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా ఎఫ్.ఆర్.ఎస్.ద్వారానే హాజరు నమోదు చేయాలన్నారు. శ్యామలనగర్ ఆర్.యు.బికి డి.పి.ఆర్.ను త్వరగా సిద్ధం చేయాలని, నగరంలోని ఆర్అండ్‌బి రోడ్ల మరమ్మతులను పూర్తి చేయాలని సదరు అధికారులను ఆదేశించారు. సమావేశంలో అదనపు కమిషనర్ పెద్ది రోజ, డిప్యూటీ కమిషనర్ టి.వెంకట కష్ణయ్య, ఎస్.ఈ. భాస్కర్, సి.ఎం.ఓ.హెచ్. డాక్టర్ విజయలక్ష్మి, ఎం.హెచ్.ఓ. డాక్టర్ భాను ప్రకాష్, ఈ.ఈ.లు సుందర్రామిరెడ్డి, శాంతి రాజు, కొండారెడ్డి, కోటేశ్వరరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కమిషనర్

పార్టీ మారడం లేదు

సుచరిత భర్త దయాసాగర్ వివరణ

ప్రజాశక్తి -గుంటూరు జిల్లా ప్రతినిధి

తమకు వైసిపి నుంచి మరోపార్టీలోకి వెళ్లే ఆలోచన లేదని మాజీ మంత్రి మేకతోటి సుచరిత భర్త మేకతోటి దయాసాగర్ పేర్కొన్నారు. ఈమేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తాము పార్టీ మారుతున్నామని మీడియాలో వస్తున్న కథనాలు సరికాదన్నారు. తాము వైఎస్ కుటుంబానికి విధేయులుగా ఉన్నామని అన్నారు. వైసిపిలోనే తాను,సుచరిత కొనసాగుతామని అన్నారు. ప్రత్తిపాడులో 2009లో పోటీ చేసినప్పటి నుంచి ఇప్పటి వరకు నియోజకవర్గంలోని అన్ని వర్గాల ప్రజలు తమ కుటుంబాన్ని ఆదరిస్తూ ఉన్నారని తెలిపారు. వారికి రుణ పడి ఉంటామన్నారు.

నేడు ఉద్యోగుల గ్రీవెన్స్

ప్రజాశక్తి-గుంటూరు

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి నేడు ఉదయం 11 గంటల నుండి కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్. శంకరన్ హాల్లో ఎంప్లాయిస్ గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి కె.చంద్రశేఖర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. కావున జిల్లాలోని ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారానికి ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆ ప్రకటనలో జిల్లా రెవెన్యూ అధికారి కోరారు.

మైనర్లకు వాహనాలిస్తే తల్లిదండ్రులపై చర్యలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రహదారి ప్రమాదాలలో 70 శాతం ప్రమాదాలు ద్విచక్ర వాహనాలు వలన జరుగుతున్నాయని ద్విచక్ర వాహనాల ప్రమాదాల్లో మరణాల సంఖ్య ఎక్కువగా ఉందని మైనర్ల వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయని ఉపరవాణ కమిషనర్ షేక్ కరీం తెలిపారు. గుంటూరులో పలుచోట్ల ఆయన తనిఖీలు చేశారు. ఎక్కువగా నగరంలో మైనర్లు వాహనాలు నడుపుతూ ప్రమాదాలు కారణం అవుతున్నారని వీటిని తల్లిదండ్రులు నియంత్రించాలన్నారు. ఇకనుండి మైనర్లు వాహనాలు నడిపితే వాహనాలను సీజ్ చేస్తామని, సంబంధిత తల్లిదండ్రులపై కేసులునమోదు చేస్తామన్నారు. తల్లితండ్రులు మైనర్లైన తమ పిల్లలకు వాహనాలను ఇవ్వరాదని, ఇస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ ప్రత్యేక తనిఖీలలో మోటార్ వాహన తనిఖీ అధికారులైన రాఘవరావు, గోపాల్, మల్లేశ్వరి, సౌజన్య, ఉషా కిరణ్, మధుసూదన్ రావు, పవన్ కుమార్ పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డు, షాదీఖానా కమిటీలకు అభినందన

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

జిల్లా వక్ఫ్‌బోర్డుకు నూతనంగా ఎన్నికైన కమిటీ, పట్టాభిపురంలోని మౌలానా అబుల్ కలాం ఆజాద్ షాదీఖానాకు కమిటీల ప్రతినిధులు ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డిని శుక్రవారం బృందావన్ గార్డెన్స్‌లోని క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారిని అప్పిరెడ్డి అభినందించారు. దేశంలోనే నిస్వార్థంగా ముస్లింల మేలు కోరిన ఏకైక ముఖ్యమంత్రి వైయస్ జగన్ అని తెలిపారు. ముస్లిం సమాజం జగన్‌కు అండగా నిలవాలని ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి పిలుపునిచ్చారు. జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ జిలాని, వైస్ చైర్మన్ స్టార్ మస్తాన్, సెక్రెటరీ సమీముల్లా బేగ్, జాయింట్ సెక్రెటరీ షేక్ సుభాని, సభ్యులు ఉమర్ అలీ , సయ్యద్ సుభాని, జానీ భాష, మున్నా, కార్పొరేటర్ షేక్ రోషన్, షాదీఖానా చైర్మన్ ఫరియాజ్, ప్రతినిధులు షఫి, నజీర్, గౌస్, పర్వీన్ బాబు పాల్గొన్నారు.



క్రీడలతో జీవనగమనం మార్పు : ఎమ్మెల్సీ అప్పిరెడ్డి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

విద్య తర్వాత మన జీవన గమనాన్ని నిర్దేశించగల శక్తి ఒక్క క్రీడలకు మాత్రమే ఉందని శాసనమండలి సభ్యులు లేళ్ళ అప్పిరెడ్డి వ్యాఖ్యానించారు. క్రమశిక్షణ, క్రమబద్ధమైన జీవనానికి క్రీడలు ఎంతగానో దోహదం చేస్తాయని ఆయన పేర్కొన్నారు. ఈనెల 12నుంచి 15వ తేదీ వరకు నూజివీడులో జరగనున్న మెన్ అండ్ విమెన్ బాస్కెట్‌బాల్ టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు ఎంపికైన గుంటూరు జిల్లా బాలికల జట్టుకు శుక్రవారం ఆయన స్పోర్ట్స్ కిట్ అందజేశారు. అప్పిరెడ్డి మాట్లాడుతూ బాస్కెట్‌బాల్ వంటి క్రీడలు శారీరక ధారుఢ్యంతో పాటు మానసిక ధృడత్వాన్ని కూడా పెంపొందిస్తాయని తెలిపారు. సీఎం వైయస్ జగన్ నేతత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకోవడం ద్వారా ప్రతి ఒక్కరూ క్రీడారంగంలో తమ సత్తా చాటాలని లేళ్ళ అప్పిరెడ్డి పిలుపునిచ్చారు. గుంటూరు అర్బన్ బ్యాంకు డైరెక్టర్ బందా రవీంద్రనాథ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్, కార్పొరేటర్లు ఈచంపాటి వెంకటకష్ణ(ఆచారి), మోతుకూరి వెంకటరత్నం, బాస్కెట్‌బాల్ కోచ్ షేక్ మగ్బుల్, సీనియర్ క్రీడాకారులు దొడ్డా చంద్రశేఖర్‌రెడ్డి, బొంతు సీతారామిరెడ్డి, పార్టీ నేతలు సోమి కమల్, వాకా సాంబిరెడ్డి, స్టార్ మస్తాన్, సుభాని తదితరులు పాల్గొన్నారు.



కోపల్లెలో టిడిపి రచ్చబండ

ప్రజాశక్తి-తెనాలిరూరల్

ప్రభుత్వ వైఫల్యాలలను ఎండగట్టేందుకు, ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు టిడిపి నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం రూరల్ గ్రామం కోపల్లెలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన రచ్చబండలో ఆయన ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. వైసిపి ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలకు, వాటిని అమలు చేయలేని పాలనా వైఫల్యాలను ప్రజలకు వివరించారు. మద్యం, మట్టి, ఇసుక, జగనన్న కాలనీ భూసేకరణలో అవకతవకలు, ఆర్టీసి, విద్యుత్ చార్జీలు, నిత్యావసర ధరల పెంపుపై ప్రజలకు తెలిపారు. ప్రశ్నించే వ్యక్తులపై అధికార పార్టీ కేసులు బనాయించటం, భయభ్రాంతులకు గురిచేస్తున్న వైనాన్ని వివరించి, ప్రజా సంక్షేమం కోసం టిడిపికి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటిసి అన్నాబత్తుని జయలక్ష్మి, మాజీ ఎంపిపి కేసన కోటేశ్వరావు, కోపల్లె శ్రీను తదితరులు పాల్గొన్నారు.


రచ్చబండలో ప్రజలతో మాట్లాడుతున్న ఆలపాటి

కెఎల్‌యులో జాతీయ ఫిలిం ఫెస్టివల్

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

కెఎల్ విశ్వవిద్యాలయంలో జాతీయ ఫిలిం ఫెస్టివల్‌ను ఘనంగా నిర్వహించారు. కెఎల్ స్టూడెంట్ ఆక్టివిటీ సెంటర్ (సాక్) విబాగం అధ్వర్యంలో ఈ నెల 5,6 తేదీలలో రెండు రోజుల పాటు జాతీయ ఫిలిం ఫెస్టివల్ ను అంగరంగ వైభవంగా జరిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన లఘు చిత్ర పోటీలతో పాటు సినీ సంబంధిత డాన్స్, నాటికల పోటీలను నిర్వహించారు. ఇంజనీరింగ్ చదువుతున్న విద్యార్థులు ప్రదర్శించిన పలు లఘు చిత్రాలు ఆహుతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయిన విశ్వవిద్యాలయం వైస్ చాన్సులర్ డాక్టర్ జి.పార్ధసారధివర్మ మాట్లాడుతూ విద్యార్థుల లోని చిత్ర నిర్మాణ స్పూర్తిని ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థి దశలోనే ఫిలిం మేకింగ్ లో ఉన్న ప్రతిభ ని గుర్తించేందుకు ఈ ఫిలిం ఫెస్టివల్ ఉపయోగపడుతుందని అన్నారు. ఇప్పటికే ఎల్ సినీ కార్నివాల్ కి అటు విద్యార్థుల్లో మరియు ఫిలిం మేకింగ్ నిపుణుల్లో మంచి స్పందన వచ్చిందన్నారు. మన రాష్ట్రం తో పాటు వివిధ రాష్ట్రాల నుండి సినిమా, ఫిలిం మేకింగ్ మీద మక్కువ ఉన్న ఎంతో మంది విద్యార్థులు ఈ ఫిలిం ఫెస్టివల్ కి హాజరు అయ్యారు.. తెలుగు సినీ పరిశ్రమ కి చెందిన ప్రముఖులు, జనాదరణ పొందిన యువ నటి నటులు కే ఎల్ సినీ కార్నివాల్ కి హాజరు అయ్యారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం వైస్ చాన్సులర్ డాక్టర్ జి. పార్ధసారధి వర్మ, ప్రో. వైస్ ఛాన్సులర్ డాక్టర్ ఎన్. వెంకట్రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎ. జగదీష్ , విధ్యార్ధి సంక్షేమ విభాగ డీన్ డాక్టర్ చప్పిడి హనుమంతరావు, సలహాదారులు, విద్యార్ధివ్యవహారాల డీన్ డాక్టర్ హబిబుల్లా ఖాన్, కేఎల్ స్టూడెంట్ ఆక్టివిటీ సెంటర్ డైరెక్టర్ పీ.సాయి విజయ్, కన్వీనర్ ప్రనయ్, కోఆర్డినేటర్ టేజేష్, సెక్రటరీ బాల శంకర్ తదితరులు పాల్గొన్నారు.





దోమల నియంత్రణ అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

పరిసరాల పరిశుభ్రతతో దోమల నివారణ

ఫ్రైడే డ్రైడే అవగాహనలో ఎమ్మెల్యే అన్నాబత్తుని

ప్రజాశక్తి-తెనాలి : పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవటంతో పాటు నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మున్సిపల్ ప్రజారోగ్య విభాగం, మలేరియా సబ్ యూనిట్ ఆధ్వర్యంలో దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నియంత్రణకు అవగాహన కార్యక్రమం చేపట్టారు. పట్టణంలోని అన్ని సచివాలయాల పరిధిలో కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణంలోని 27, 32 వార్డుల పరిధిలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొనగా, మరి కొన్ని సచివాలయాల పరిధిలో చైర్‌పర్సన్ సయ్యద్ ఖాలేదానశీం, కమిషనర్ ఎం.జస్వంతరావు పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కీటక వాహక జనిత వ్యాధుల నియంత్రణతో వ్యాదులను అరికట్టవచ్చన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ ఎం.గోపాలరావు, మున్సిపల్ ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెచ్ నిర్మల, మలేరియా సబ్ యూనిట్ అధికారి ఎస్.ఉమాకాంత్, సూపర్‌వైజర్ డి.శ్రీనివాసరావు, మలేరియా ఆరోగ్య కార్యకర్తలు ఎస్‌కే రషీద్, ఎస్‌కె నవీన్. వార్డు శానిటరీ సెక్రటరీ పి.సునీత, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు

ప్రజాశక్తి - కొల్లిపర: మండల పరిధిలోని వల్లభాపురం గ్రామ శివారు పీకా వారి పాలెం లో మున్నంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఫ్రైడే డ్రై డే కార్యక్రమంలో దోమల నిర్మూలనకు నీటి గుంటలలో ఎబెట్ ద్రావకాన్ని పిచికారి చేశారు. అనంతరం గ్రామస్తులకు అవగాహన కల్పించారు కార్యక్రమంలో ఎంపీటీసీ కేసరి రజిని, అందే బాలచంద్రమౌళి, దమ్ము ఆశీర్వాదమ్మ, ఏఎన్ఎం కూరపాటి శ్యామ్ జ్యోతి పాల్గొన్నారు.

కెఎల్‌యులో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్ :రక్త దానం ప్రాణదానమని కెఎల్ విశ్వవిద్యాలయం విద్యార్థి సంక్షేమ విభాగ డీన్ డాక్టర్ చప్పిడి హనుమంతరావు అన్నారు. స్థానిక వడ్డేశ్వరంలోని కెఎల్ డీమ్డ్ విశ్వవిద్యాలయం లో శుక్రవారం రక్త దాన శిబిరం నిర్వహించారు. యూత్ రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ రక్తదాన శిబిరంలో కెఎల్ విశ్వవిద్యాలయంలో ఆయా విబాగాల్లో చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులు పెద్దసంఖ్యలో హాజరయి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా సాక్ అసోసియేట్ డీన్ కె. రూత్ రమ్య మాట్లాడుతూ ఆరోగ్యవంతులు ప్రతి ఆరు నెలలకు ఒకసారి రక్తా దానం అని చేయవచ్చు అని అన్నారు. ఈ సందర్భంగా సేకరించిన రక్త యూనిట్లను అసోసియేషన్ విత్ ఆంధ్ర హాస్పిటల్ వారికి అందజేశారు. అనంతరం రక్తదానం చేసిన విద్యార్థు లకు సర్టిపికేటక్లను అందజేశారు. విశ్వవిద్యాలయం విసి డాక్టర్ జి. పార్థసారథి వర్మ విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఆంధ్రా ఆసుపత్రి వైద్య సిబ్బంది, సి.ఈ.ఏ. అద్యాపకులు, ఇన్చార్జి డాక్టర్. గోపి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


పరిశుద్ధరావును సత్కరిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

పౌరాణిక నటుడు పరిశుద్ధరావుకు సత్కారం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

స్థానిక బోస్‌రోడ్డులోని పెమ్మసాని థియేటర్‌లో మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ సారధ్యంలో నిర్వహిస్తున్న ఎన్టీఆర్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఎన్టీఆర్ నటించిన తాతమ్మ కల చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. అలాగే కళాకారుల సత్కారాల్లో భాగంగా పట్టణానికి చెందిన ప్రముఖ రంగస్థల పౌరాణిక కళాకారుడు కొమ్మతోట పరిశుద్ధరావును సత్కరించారు. కార్యక్రమంలో కె.రాజు, శెట్టి చంద్రబాబు, అవిశా యోహాను, గంజి దుర్గాప్రసాద్, దాసరి శుభాకర్, పుట్టి నాగేశ్వర్రావు, పెమ్మసాని పోతురాజు, ఎం.రాఘవరావు, జగన్ పాల్గొన్నారు.

కిట్స్ అధ్యాపకురాలికి డాక్టరేట్

ప్రజాశక్తి-గుంటూరు

కిట్స్ ఇంజినీరింగ్ కాలేజి అధ్యాపకురాలు వడ్లమూడి లక్ష్మి కిరణ్మయికి జెఎన్‌టియు అనంతపురం డాక్టరేట్ ప్రదానం చేసింది. కిరణ్మయి 'స్టడీస్ ఆన్ ఎట్ మాస్ ఫియరిక్ ఎరోసోల్స్ యూసింగ్ మోడిస్ శాటిలైట్ డేటా ఓవర్ ట్రాపికల్ రీజియన్, ఇండియా' అనే అంశంపై, యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ పి.విష్ణుప్రశాంత్ పర్యవేక్షణలో కిరణ్మయి తన తన పరిశోధన చేశారు. ఈ సందర్భగా కళాశాల ఛైర్మన్ కోయి సుబ్బారావు కిరణ్మయిని అభినందిస్తూ, తమ కళాశాల అధ్యాపకుల్ని పరిశోధనల దిశగా ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. కిరణ్మయిని అభినందించిన వారిలో కళాశాల సెక్రెటరీ కోయి శేఖర్, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ కె.హరిబాబు, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.బాబు, కళాశాల ఎస్ అండ్ హెచ్ విభాగాధిపతి ఎం.బసవేశ్వరరావు, అధ్యాపకులు ఉన్నారు.



కిరణ్మయిని అభినందిస్తున్న కళాశాల ఛైర్మన్ కోయి సుబ్బారావు

ఏపీ ఫార్మసీ కౌన్సిల్‌లోకి విజ్ఞాన్ అధ్యాపకురాలు

ప్రజాశక్తి-గుంటూరు : వడ్లమూడి, విజ్ఞాన్ ఫార్మసీ కళాశాల అధ్యాపకురాలు ప్రొఫెసర్ పులిపాటి సౌజన్య ఏపీ ఫార్మసీ కౌన్సిల్‌లో నామినేటెడ్ మెంబర్‌గా ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీ.శ్రీనివాసబాబు తెలిపారు. భారతదేశ ఔషధ రంగాన్ని పరీక్షించి, పరిరక్షించే భారత ఫార్మసీ కౌన్సిల్ అనుసంధానంగా నడిచే ఏపీ ఫార్మసీ కౌన్సిల్ విభాగంలో సభ్యులుగా పులిపాటి సౌజన్యని మెంబర్‌గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.టీ.కృష్ణబాబు ఉత్తర్వులు జారీ చేశారన్నారు. సౌజన్య 16 ఏళ్లుగా విజ్ఞాన్స్ ఫార్మసీ కళాశాలలో అధ్యాపకురాలిగా సేవలందిస్తున్నారని, ఫార్మసీ విద్యకు ఆమె పరిశోధనలతో పాటు ప్రచురించిన మ్యాగజైన్లు రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి ఈ పదవిలో 5 సంవత్సరాల పాటు పనిచేసే అవకాశం ఇచ్చిందన్నారు. నామినేటెడ్ మెంబర్‌గా ఎంపికైన పులిపాటి సౌజన్యను ప్రిన్సిపల్ డాక్టర్ పీ.శ్రీనివాసబాబు, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపక సిబ్బంది అభినందించారు.



అధ్యాపకురాలు సౌజన్యను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

స్విమ్మింగ్‌లో భాష్యం విద్యార్థులకు పతకాలు

ప్రజాశక్తి-గుంటూరు

దేహదారుఢ్యానికి, మానసిక ఉల్లాసానికి చదువుతోపాటు, ఆటలు కూడా ఎంతో అవసరమని భాష్యం విద్యాసంస్థల ఛైర్మన్ భాష్యం రామకృష్ణ అన్నారు. భాష్యం మెడెక్స్‌లో బైపిసి చదువుతూ అత్యుత్తమ ప్రతిభతో స్విమ్మింగ్‌లో స్వర్ణపతకాలు సాధించటం ఎంతో ఆనందం గా ఉందన్నారు. శుక్రవారం స్థానిక చంద్రమౌళిక నగర్‌లోని భాష్యం ప్రధాన క్యాంపస్‌లో ఆయా విద్యార్థులను అభినందించారు. ఈనెల 3, 4 తేదీల్లో తిరుపతిలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించిన స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్‌లో మొత్తం 4 స్వర్ణాలు, 1 రజతం, 1 కాంస్య పతకాన్ని తమ విద్యార్థులు సాధించారని రామకృష్ణ తెలిపారు. జూనియర్ ఇంటర్ విద్యార్థిని శొంటి భవ్య 400 మీటలర్ల వ్యక్తిగత మెడ్లీలో ఒక స్వర్ణం, 200 మీటర్ల బటర్‌ఫ్లైలో ఒక స్వర్ణం సాధించిందన్నారు. అలాగే శొంటి భావిక 400 మీటర్ల ఫ్రీ స్టైల్‌లో ఒక స్వర్ణం, 100 మీటర్ల బ్యాక్ స్ట్రోక్‌లో ఒక స్వర్ణ పతకం సాధించిందని వివరించారు. అలాగే సీనియర్ ఇంటర్ విద్యార్థి శొంటి రత్నసాయి 800 మీటర్ల ఫ్రీ స్టైల్‌లో ఒక సిల్వర్ మెడల్, 400 మీటర్ల ఫ్రీ స్టైల్‌లో ఒక కాంస్య పతకాన్ని సాధించి భాష్యం పేరును ఇనుమడింప చేశారని కొనియాడారు. ఈ సందర్భంగా రామకృష్ణ, ప్రిన్సిపాల్ బి.హరిబాబు, విద్యార్థులను అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఛైర్మన్, ప్రిన్సిపాల్

బాలల చట్టాలపై అవగాహన ఉండాలి

బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు పద్మావతి

ప్రజాశక్తి-గుంటూరు :బాలల హక్కులకు సంబంధించిన వివిధ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు బత్తుల పద్మావతి అన్నారు. జిల్లా మహిళా, శిశు అభివృద్ధి సంస్థ, అలాగే జిల్లా బాలల పరిరక్షణ విభాగం సంయుక్త ఆధ్వర్యములో శుక్రవారం గుంటూరు, పల్నాడు జిల్లాలకు సంబంధించిన స్వచ్ఛంద సేవా సంస్థలకు, బాలల సంరక్షణ నిలయాలకు గుంటూరులోని డిఆర్‌డిఎ సమావేశ మందిరంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో పద్మావతి మాట్లాడుతూ పిల్లల రక్షణ, సంరక్షణ వారి శ్రేయస్సు, విద్య, వైద్యం, ఆరోగ్యం మొదలైన విషయములపై, అందిస్తున్న సేవల గురించి, బాలల న్యాయ చట్టం-2005, ఆర్‌టిఐ యాక్ట్ 2009, లైగింక వేధింపుల చట్టం 2012 వంటి చట్టాలపై ప్రతి స్వచ్ఛంద సంస్థ అవగాహన కలిగి ఉండాలన్నారు. చైల్డ్ కేర్ ఇనిస్టిట్యూటషన్స్‌లో పిల్లల భద్రతకు భరోసా కలిగే విధముగా నడుచుకోవాలని, ఏ చైల్డ్ కూడా సంవత్సరాల తరబడి చైల్డ్ కేర్ ఇనిస్టిట్యూటషన్స్‌లో ఉంచకూడదని, వారి కుటుంబాల చెంతకు చేర్చాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీడ్స్ సంస్థ డైరెక్టర్ డి.రోషన్‌కుమార్, జిల్లా పర్యవేక్షణాధికారి సత్యనారాయణ, జిల్లాల బాలల పరిరక్షణాధికారి టి.దుర్గాభవానీ, రక్షణాధికారి బి.విజయ్‌కుమార్, న్యాయ, పరిరక్షణాధికారి బి.వాసంతి, డిసిపిఓ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పద్మావతి

ఓవరాల్ ఛాంప్ జిపిడబ్ల్యూ

ముగిసిన మహిళా పాలిటెక్నిక్ క్రీడలు

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక గుజ్జనగుండ్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కాలేజిలో రెండ్రోజులపాటు నిర్వహించిన పాలిటెక్నిక్ 25వ మహిళల జిల్లా స్థాయి క్రీడలు శుక్రవారం ముగిశాయి. వ్యక్తిగత, ఓవరాల్ ఛాంపియన్ షిప్‌ను ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కాలేజి నిలిచింది. చివరి రోజు 100 మీటర్లు, 200 మీటర్ల పరుగు పందెంలో ఆతిథ్య మహిళా పాలిటెక్నిక్ విద్యార్థిని ఎం.లావణ్య మొదటి స్థానంలో, మాచర్ల న్యూటన్స్ పాలిటెక్నిక్ కాలేజి విద్యార్థిని డి.భావన వైష్ణవి ద్వితీయ స్థానంలో నిలిచారు. బుడంపాడు సెయింట్ మేరీస్ పాలిటెక్నిక్ విద్యార్థిని పి.వసంత, చేబ్రోలు సెయింట్ మేరీస్ పాలిటెక్నిక్ విద్యార్థిని బి.హారిక 400 మీటర్ల పరుగులో ప్రథమ, ద్వితీయ స్థానంలో నిలిచారు. అలాగే 800 మీటర్ల పరుగు పందెంలో సెయింట్ మేరీస్ విద్యార్థిని పి.నవ్య, పొన్నూరు విఎన్‌ఆర్ పాలిటెక్నిక్ విద్యార్థిణి ఏ.ప్రీతి ప్రథమ, ద్వితీయ స్థానాలు దక్కించుకున్నారు. షార్ట్‌పుట్‌లో ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ విద్యార్థిని రజిత, సెయింట్ మేరీస్ విద్యార్థిని జి.సిరి ప్రథమ, ద్వితీయ స్థానం సాధించారు. డిస్కస్‌త్రో ఈవెంట్లో ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ విద్యార్థిని రజిత, సెయింట్ మేరీస్ విద్యార్థిని మోహిని ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు. 100 మీటర్ల రిలే పరుగు పందెంలో సెయింట్ మేరీస్ కాలేజి ప్రథమ స్థానం, బాపట్ల పాలిటెక్నిక్ ద్వితీయ స్థానంలో నిలిచింది. లాంగ్ జంప్‌లో బుడంపాడు సెయింట్ మేరీస్ విద్యార్థిని కే.ధనలక్ష్మి, చేబ్రోలు సెయింట్ సెయింట్ మేరీస్ విద్యార్థిని బి.కల్పన ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు. ట్రిపుల్ జంప్ మొదటి స్థానంలో లావణ్య, రెండో స్థానంలో రజిత ఇద్దరూ ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ నుంచి గెలుపొందారు. ఈ సందర్భంగా ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్.ప్రభాకర్‌రావు గెలుపొందిన విద్యార్థులకు మెమొంటోలు అందచేసి, అభినందనలు తెలిపారు.



జిపిడబ్ల్యూ విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు



లాంగ్‌జంప్ చేస్తున్న విద్యార్థిని

బ్యాడ్మింటన్‌లో ఛాంప్ ఎఎస్ఎన్ కళాశాల



క్రీడాకారులతో విద్యాసంస్థల ఛైర్మన్ శివకుమార్

ప్రజాశక్తి-తెనాలి: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల క్రీడా పోటీల్లో పట్టణానికి చెందిన ఏఎస్ఎన్ డిగ్రీ కళాశాల విద్యార్థుల టీం బ్యాడ్మింటన్‌లో ఛాంపియన్‌షిప్‌ను కైవశం చేసుకున్నట్లు ఆ విద్యాసంస్థల ఛైర్మన్ అన్నాబత్తుని శివకుమార్ చెప్పారు. ప్రకాశం రోడ్డులోని కళాశాల ఆవరణలో శుక్రవారం ప్రతిభ చూపిన క్రీడాకారులను ఆయన అభినందించారు. క్రీడల్లో విద్యార్థులు మరింతగా రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రాంచంద్, పిడి నల్లక శేషగిరిరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

వివిఐటి విద్యార్థినులకు బంగారు పతకాలు

ప్రజాశక్తి-తెనాలి: జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ 9వ స్నాతకోత్సవాన్ని పురస్కరించుకుని యూనివర్సిటీ అంతర్ కళాశాలల పోటీల్లో వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలకు చెందిన విద్యార్థినులు సత్తా చాటారు. బంగారు పతకాలను గెలుచుకున్నారు. 2017-2021 విద్యాసంవత్సరానికి సంబంధించి మెకానికల్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన ఆలపాటి రాగశ్రీవాణి 9.2 సిజిఏతో అకడమిక్ టాపర్‌గా నిలిచింది. అలాగే 2018-2022 సంవత్సరానికి సంబంధించి కంప్యూటర్ సైన్స్ విభాగానికి చెందిన తమ్మిశెట్టి మంజూశ్రీ అకడమిక్ టాపర్‌గా నిలిచి న్యూఢిల్లీకి చెందిన కంప్యూటర్ సొసైటీ కార్పోరేషన్ అందించే గోల్డ్ మెడల్స్‌కు ఎంపికైనట్లు కళాశాల ఛైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ చెప్పారు. విద్యార్థినులను ఆయన అభినందించారు. ప్రతిభ చూపిన విద్యార్థినులకు యూనివర్సిటీ స్నాతకోత్సవంలో అభినందించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వై.మల్లిఖార్జునరెడ్డి, డైరెక్టర్ డాక్టర్ వైవిఎస్ఎస్‌వి ప్రసాదరావు, డీన్ ఆఫ్ అకడమిక్స్ డాక్టర్ కెగిరిబాబు, డీన్ ఆఫ్ అడ్మిన్ డాక్టర్ ఎస్.కుమారస్వామి, అధ్యాపక బృందం పాల్గొన్నారు.



నాగశ్రీవాణి, మంజుశ్రీ

మాచర్లలో పెద్ద షాపింగ్ మాల్స్ అభినందనీయం

స్టైల్ యూనియన్ షాపింగ్ మాల్ ప్రారంభోత్సవంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

ప్రజాశక్తి - మాచర్ల

మాచర్ల పట్టణం అభివృద్ధి చెందుతుందని, వ్యాపార వేత్తలకు చాల అనుకూలవైనదని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణ రెడ్డి అన్నారు. స్థానిక పార్క్ సెంటర్ సమీపంలో గుంటుపల్లి వెంకటగాంధీ టవర్స్‌లో నూతనంగా ఏర్పాటైన స్టైల్ యూనియన్ షాపింగ్ మాల్‌ని శుక్రవారం ఉదయం ప్రభుత్వ విప్, ఎం.ఎల్.ఎ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ మాచర్ల పట్టణ వ్యాపార వర్గాలకు అన్ని విధాల అనుకూలమైన ప్రదేశమని మధ్య తరగతి, ఎగువ మధ్యతరగతి వర్గాలు అధికంగా ఉన్న ఈ ప్రాంతంలో షాపింగ్ మాల్స్ అవశ్యకత ఉందన్నారు. వ్యాపారస్థులకు తమ సహకారం ఎప్పుడు ఉంటుందన్నారు. గుంటుపల్లి వెంకటగాంధీ మాట్లాడుతూ ఇతర ప్రాంతాల నుండి ఇక్కడకు వచ్చి ఇక్కడ ప్రజల అవసరాల మేరకు ఇంత పెద్ద షాపింగ్ మాల్ ఏర్పాటు చేయటం సంతోషకరమన్నారు. ఈ షాపింగ్ మాల్‌లో ప్రజలకు సరసరమైన ధరలకు వస్త్రాలు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవా లన్నారు. షాపింగ్ మాల్ ఓపెనింగ్ కార్యాక్రమం ఎంతో వేడుకగా జరిగింది. షాపింగ్ మాల్‌లో చాల మందికి ఉపాధి లభిస్తుందన్నారు. ప్రభుత్వ విప్, ఎం.ఎల్.ఎ పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి షాపింగ్ మాల్ యాజమాన్యం ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో వైసిపి యువజన సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకటరామిరెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ బోయ రఘురామిరెడ్డి, నాయకులు ఎం శ్రీనివాసశర్మ, బూడిద శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



పెన్షన్లు తక్షణమే విడుదల చేయాలి

ప్రజాశక్తి-గుంటూరు

రాష్ట్రంలోని పెన్షనర్లందరికీ 6వ తేదీ వచ్చినా పెన్షన్లు జమ కాకపోవటం బాధాకరమని, ముఖ్యంగా ఫ్యామిలీ పెన్షనర్లు, వితంతు, మెంటల్ డిజార్డర్ పెన్షన్లు మంజూరు కాలేదని ఆంధ్రప్రదేశ్ స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.వెంకటేశ్వర్లు, జి.ప్రభుదాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పెన్షన్‌పై ఆధారపడి బ్రతుకుతున్న వారి బాధలు చెప్పనలవి కానివన్నారు. పెన్షన్లు జమ కాక అద్దెలు, మందులషాపుకు, పాల వాళ్లకు ఏం సమాధానం చెప్పాలో తెలియక మదన పడుతున్నారని అన్నారు. ఉద్యోగులు సైతం ముందు పెన్షనర్లకు పెన్షన్లు చెల్లించాలని కోరినా ప్రతి నెలా 13వ తేదీ వరకూ పెన్షన్లు జమ కావట్లేదన్నారు. పెన్షనర్ల పట్ల ప్రభుత్వానికి ఇంత నిర్లక్ష్యం పనికిరాదని విమర్శించారు. సామాజిక పెన్షన్లతోపాటు, రిటైర్డ్ ఉద్యోగులకూ ప్రతి నెలా ఒకటో తేదీన పెన్షన్ విడుదల చేయాలని కోరారు. డిఎ అరియర్స్ కూడా వెంటనే విడుదల చేయాలని కోరారు.